www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 18-1-2025
Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విశాఖపట్నం


పురుషోత్తపురం వద్ద రాత్రివేళ కురుస్తున్న మంచు

శివారుల్లో మంచు, చలి

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం దట్టంగా మంచు కురిసింది. తెల్లవారుజాము నుంచి ఎనిమిది గంటల వరకూ మంచు కొనసాగింది. దీంతో ఉదయం పూట వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా మంచు, ఉదయం మేఘాలు ఆవరించడంతో చలి పెరిగింది. నగరంతో పోల్చితే శివారు ప్రాంతాల్లో చలి ఎక్కువగా ఉంది. రెండు, మూడు రోజుల తరువాత చలి మరికాస్త పెరుగుతుందన్నారు.

నత్తనడకన సైన్స్ మ్యూజియం పనులు

- ఏడాది కిందట శంకుస్థాపన
- సంవత్సరంలో అందుబాటులోకి తీసుకువస్తామని అప్పట్లో ప్రకటనలు
- కనీసం సగం కూడా పూర్తికాని వైనం


నత్తనడకన సాగుతున్న మ్యూజియం పనులు

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై అడ్వాన్స్‌డ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణం నత్తనడకన సాగుతోంది. గత ఏడాది జనవరి రెండో తేదీన మ్యూజియం నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఏడాదిలో పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని నాటి ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. రూ.6 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టారు. అందులో రూ.4.69 కోట్లు కేంద్ర నిధులు కాగా సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ రూ.93.80 లక్షలు సమకూర్చడానికి ముందుకువచ్చింది. మ్యూజియంలో 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికాన్ మ్యూజియం, సోలార్ స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ఉంటాయని శంకుస్థాపన సమయంలో వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రకటించారు. నిర్మాణ బాధ్యతలను ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సంస్థ చేపట్టింది. అయితే పర్యవేక్షణ లోపం వల్ల పనులు మందకొడిగా సాగుతున్నాయి. కనీసం సగం కూడా పూర్తి కాలేదు. ఇందులో వీఎంఆర్‌డీఏ పాత్ర ఏమీ లేదని, వారు కోరినంత భూమి మాత్రమే ఇచ్చామని అధికార వర్గాలు తెలిపాయి.

ఉక్కుకు మంచి రోజులు

తొలగనున్న చిక్కులు

రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన ఎన్‌డీఏ ప్రభుత్వం



- తక్షణం రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూస్తామని ప్రకటన
- ఆగస్టు నుంచి మూడో బ్లాస్ట్ ఫర్నేస్ అందుబాటులోకి...
- ఐరన్‌ఓర్ సరఫరాకు ఎన్‌ఎండీసీతో చర్చలు
- ఇక ఉత్పత్తి పరుగులే
- మాట నిలుపుకున్న కూటమి నేతలు
- కార్మిక వర్గాల హర్షం


స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం నిధులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ నగరంలోని టీడీపీ కార్యాలయంలో బాణసంచా కాలుస్తున్న నాయకులు, కార్యకర్తలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'విశాఖ ఉక్కు...ఆంధ్రుల హక్కు' అనే మాట పదికాలాలు నిలిచేలా కూటమి ప్రభుత్వం చేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న స్టీల్‌ప్లాంటుకు భారీ ప్యాకేజీ ప్రకటించింది. తక్షణమే రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు పూర్తికాలం పనిచేసేలా, ఆగస్టు నుంచి మూడో బ్లాస్ట్ ఫర్నేస్ అందుబాటులోకి వచ్చేలా చూస్తామని వెల్లడించింది.

విశాఖ ఉద్యోగుల సంఘం, కార్మిక సంఘాలు రూ.15 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ కోరగా... రూ.11,440 కోట్లు ఇస్తున్నట్టు శుక్రవారం తెలిపింది. దీనికంటే ముందు రూ.1,650 కోట్లు అందజేసింది. అయితే సెయిల్‌లో విలీనం చేయాలనే తమ ప్రధాన డిమాండ్‌ను పట్టించుకోలేదని సీఐటీయూ వంటి కార్మిక సంఘాలు తటస్థ వైఖరి అవలంబించగా మిగిలిన సంఘాలన్నీ ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నాయి. స్టీల్‌ప్లాంటుకు కష్టాలు తొలగిపోయినట్టేనని, ఇక అన్నీ మంచిరోజులేనని సంతోషం వ్యక్తంచేస్తున్నాయి. కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించడంతో వైసీపీ నేతల నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్టయింది. వైసీపీ హయాంలో స్టీల్‌ప్లాంటుకు రూపాయి కూడా సాయం చేయకపోవడమే దీనికి కారణం.

కూటమి నేతలు సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు, తదితరులంతా స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని, ఆర్థిక సాయం కోసం ప్రయత్నం చేస్తామని కార్మిక, ఉద్యోగ సంఘాలకు స్పష్టమైన భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరుసటిరోజు నుంచే ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఆరు నెలల వ్యవధిలో రూ.1,650 కోట్ల సాయం వచ్చేలా చేశారు. ఇప్పుడు భారీ ప్యాకేజీ ఇచ్చేలా ఢిల్లీ పెద్దలను ఒప్పించారు. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ వచ్చినప్పుడు స్టీల్ ప్లాంటు గురించి మాట్లాడలేదని, సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కూడా ఈ సమస్యను ప్రస్తావించలేదని విమర్శలు చేసిన రాజకీయ, కార్మిక సంఘ నాయకులు ఇప్పుడు నోరు మెదపలేకపోతున్నారు.

జీతాలు అందుతాయి...ఉద్యోగాలు నిలుస్తాయి

ఇన్నాళ్లూ ఉత్పత్తికి అవసరమైన ముడిపదార్థాలు కొనుగోలు చేయడానికి నిధులు అందుబాటులో లేక స్టీల్ అమ్మగా వచ్చిన మొత్తాలన్నీ సరఫరాదారులకు ఇచ్చేశారు. దాంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చింది. ఇప్పుడు కేంద్రం రూ.11,440 కోట్లు సాయం చేయడం వల్ల ముడి పదార్థాలకు నిధుల లభ్యత పెరుగుతుంది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇచ్చే సౌలభ్యం కలుగుతుంది. గతంలో మాదిరిగానే నెలాఖరున జీతాలు అందుకునే పరిస్థితి వస్తుంది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ కూడా ఆగస్టు నుంచి ప్రారంభమవుతుందని

... మిగతా 2వ పేజీలో

స్టీల్‌ప్లాంటుకు మంచి రోజులు

- పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే



కష్టాల్లో కూరుకుపోయిన విశాఖ స్టీల్‌ప్లాంటుకు కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీతో మంచి రోజులు రానున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత ఏడు నెలలుగా పదే పదే స్టీల్‌ప్లాంటు సమస్యను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ఆర్థిక ప్యాకేజీ ఇప్పించగలిగారు. గత ముఖ్యమంత్రి జగన్ అధికారాన్ని సొంత ప్రయోజనాలకే వాడుకున్నారే తప్ప... ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ఏమీ చేయలేదు. అటువంటిది అధికారం చేపట్టిన ఏడు నెలల్లోనే చంద్రబాబునాయుడు స్టీల్‌ప్లాంటు విషయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడం శుభపరిణామన్నారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఉక్కుశాఖా మంత్రి హెచ్‌డి.కుమారస్వామికి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ప్రజల తరుపున ధన్యవాదాలు.

ప్రజల విజయం

- జె.అయోధ్యరామ్, సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు



స్టీల్‌ప్లాంటుకు కేంద్రం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం ప్రజల విజయం. అయితే సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. గత నాలుగేళ్లుగా ఉద్యమాన్ని నడుపుతున్నాం. చంద్రబాబునాయుడు నాయకత్వంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్యాకేజీ తేవడం మంచి విషయం. ప్లాంటును సెయిల్‌లో విలీనంచేస్తేనే మనుగడ సాధ్యపడుతుంది.

సొంత గనులు కూడా కేటాయించాలి

- మంత్రి రాజశేఖర్, ఇంటక్ జాతీయ కార్యదర్శి



విశాఖ స్టీల్ ప్లాంటుకు ఆర్థిక సహాయం అందించడం మంచి విషయం. ఈ సాయంతో ఓ ప్రణాళిక ప్రకారం ముందుకుసాగితే మంచి ఫలితాలు ఉంటాయి.అయితే ప్లాంటుకు ప్రధాన సమస్య గనులే.అవికూడా కేటాయిస్తే బాగుణ్ను.ప్లాంటు దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా ఎన్‌ఎండీసీలో గానీ, సెయిల్‌లో గానీ విలీనం చేయాలి.

పంచాయతీకొక మోడల్ పాఠశాల

- 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలనే పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశం
- జిల్లాలో 121 పాఠశాలల్లో 60కు మించి విద్యార్థులు
- ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల విద్యార్థులు
- ప్రాథమిక పాఠశాలలకు పంపాలని నిర్ణయం
- ఇకపై యూపీ పాఠశాలలు ఉండవు
- ఎనిమిది యూపీ పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్



విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విలీనానికి సంబంధించి వైసీపీ హయాంలో తెచ్చిన జీవో నంబర్ 117ను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు రూపొందిస్తోంది. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను తీర్చిదిద్దాలని భావిస్తోంది. అయితే అందుకు 60 మంది పిల్లలు ఉండాలి. విశాఖ జిల్లాలో 60, అంతకంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలు 121 ఉన్నట్టు విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంకా యూపీ పాఠశాలలను పూర్తిగా రద్దు చేయనున్నారు. ఉన్నత పాఠశాలలకు మూడు కిలోమీటర్ల పరిధిలో 6,7,8 తరగతుల్లో 60కు మించి విద్యార్థులు ఉన్న ఎనిమిది యూపీ పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. దీనికి సంబంధించి పూర్తిస్థాయి కసరత్తుకు విద్యా శాఖ నిర్ణయించింది.

జిల్లాలో ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్, మునిసిపల్ ప్రాథమిక,

... మిగతా 2వ పేజీలో

నేడు స్వచ్ఛ దివస్

- ఇకపై ప్రతి నెలా మూడో శనివారం నిర్వహణ
- నగరంలో పార్కులు, గ్రామీణ ప్రాంతంలో నీళ్ల ట్యాంకులు, డ్రైనేజీలు క్లీనింగ్
- పరిశుభ్రతలో ఉత్తమ వార్డుకు అవార్డు
- ప్రభుత్వ కార్యాలయాల్లోనూ కార్యక్రమం
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నెలలో మూడో శనివారం ఇకపై స్వచ్ఛ దివస్‌గా పరిగణించనున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. దేశంలో అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం తలపెట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధిలో పార్కులు, గ్రామీణ ప్రాంతాల్లో నీటి ట్యాంకులు శుభ్రం చేయడం, మురుగుకాల్వల్లో పూడికతీత వంటివి చేపట్టాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని శుభ్రం చేయాలన్నారు. దీనిలో భాగంగా శనివారం నగరంలో శివాజీ పార్కులో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. పార్కుల్లో పరిశుభ్రత విషయంలో వార్డుల మధ్య పోటీ పెడతామని, ఉత్తమంగా పార్కును తీర్చిదిద్దిన వార్డుకు అవార్డుతోపాటు అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామన్నారు. ఏడాది పొడవునా కొత్త థీమ్‌తో ప్రతి మూడో శనివారం ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు శుభ్రం చేసి చక్కగా బీరువాల్లో సర్దడం, కార్యాలయ ఆవరణలో చెత్తా చెదారం తొలగించడం వంటివి చేపట్టాలన్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్

... మిగతా 2వ పేజీలో

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

- స్థాయీ సంఘ సమావేశాలు కూడా...



విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సవరణ, వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ ఆమోదం కోసం శనివారం ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. అంతకు ముందు ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకు స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. తొలుత స్థాయీ సంఘ సమావేశాల్లో సవరించిన, అంచనా బడ్జెట్‌లు ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదం తీసుకుని తరువాత సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెడతామని పేర్కొన్నారు. సభ్యులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

వచ్చే నెల మొదటి వారంలో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం ప్రారంభం

- నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ రూ.80 కోట్లతో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కారు పార్కింగ్/కమర్షియల్ కాంప్లెక్స్ భవనం పనులను ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. ఆయన ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి శుక్రవారం భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రతి అంతస్థు తిరిగి పనులు ఎక్కడెక్కడ అసంపూర్తిగా ఉన్నాయో గుర్తించారు. అవసరమైతే ఎక్కువ మంది పనివారిని పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లో నెలాఖరుకు నిర్మాణం పూర్తిచేయాలని స్పష్టంచేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు.ఇదే అంశంపై సోమవారం సమీక్షిస్తామని, కాంట్రాక్టర్‌కు తెలిపారు.ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు మధుసూదన్, రామరాజు పాల్గొన్నారు.

సాంకేతికతలో స్వావలంబన సాధించాలి

విద్య, సాంకేతికత, పరిశ్రమ రంగాల మధ్య సమన్వయం అవసరం

- విశాఖపట్నం ఐఐఎం వ్యవస్థాపక దినోత్సవంలో డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్


అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో విద్య, సాంకేతికత, పరిశ్రమ రంగాల మధ్య సమన్వయం అవసరమని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ అన్నారు. నగర శివారు గంభీరంలో గల ఐఐఎంవి 11వ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామత్ 'డిఫెన్స్ ఆర్ అండ్ డి -ద రోడ్ ఎహెడ్' అనే అంశంపై మాట్లాడుతూ ప్రాథమిక పరిశోధన అంటే

... మిగతా 2వ పేజీలో



పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న పైలాన్

శరవేగంగా పైలాన్ నిర్మాణం

భీమునిపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో పైలాన్ నిర్మాణం జోరుగా సాగుతోంది. వచ్చే నెల 1, 2 తేదీల్లో పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని నిర్వహణ కమిటీ ప్రయత్నాలు సాగిస్తోంది. కమిటీ ఛైర్మన్‌గా గంటా శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా గాడు అప్పలనాయుడు, మైలపల్లి లక్ష్మణరావు,కోశాధికారిగా పూసర్ల శ్రీను వ్యవహరిస్తున్నారు. ఉత్సవాలకు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు చెబుతున్నారు. ఈమేరకు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, జీఎంఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ హెచ్‌ఆర్ కట్టమూరి పోతన్న శెట్టి, ఆయన సోదరులు సంయుక్తంగా రూ. 2 లక్షలతో పైలాన్ నిర్మిస్తున్నారు. శతాబ్ది ఉత్సవ్‌కు గుర్తుగా ఏర్పాటు చేస్తున్న 12 అడుగుల ఎత్తైన పైలాన్‌పై భాగంలో పాఠశాల ఫొటో, సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే చుట్టూ గ్రానైట్ రాయితో అందంగా పలక వేయనున్నారు.

కాలువల్లో చెత్త వేస్తే చర్యలు



పనులను పరిశీలిస్తున్న జడ్సీ ఫణికుమార్

మధురవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కాలువల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని జోన్-2 జడ్సీ ఫణికుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఏడో వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి, పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని, సింగిల్ యూజ్డ్ పాలిథిన్ కవర్లు వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ కిశోర్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై విద్యార్థినులకు అవగాహన

ఆనందపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీపాలెం పంచాయతీ పరిధిలోని నేళ్తేరు గ్రామంలో ఉన్న కేజీబీవీ బాలికలకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలికలను వేములవలసలో ఉన్న బాలాజీ స్వీట్స్ అండ్ బేకరీకి తీసుకువెళ్లి వంట శాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ చూపించారు. బేకరీ యజమానులు మాధవరావు రొట్టెలు, కుకీష్, కేకులు, స్వీట్స్ తయారీ గురించి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినులు ఖలేషా బేగం, స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఇంటర్నెట్‌షిప్‌లో భాగంగా బాలికలకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పద్మనాభం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయినాడలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై జె. సురేశ్ చెప్పారు. పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 12650 నగదు కూడా స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

ఎన్‌టీఆర్ విగ్రహానికి రంగులు

భీమునిపట్నం,జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబజారు జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు వేశారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా జంక్షన్‌లో హెయిర్ సెలూన్ నడిపే బార్బర్ ఏనుగుతల వెంకటరావు విగ్రహానికి రంగులు వేయించారు. ఆయన ఎన్టీఆర్ వీరాభిమాని. ఏటా ఇక్కడి విగ్రహానికి తన సొంత డబ్బులతో రంగులు వేయిస్తుంటారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కొమ్మాది, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మొల్లి హేమలత శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల వార్డులోని ఎగువ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తాను గెలిచిన తరువాత తొలుత రోడ్లు, కాలువలు, తాగునీటి పైపులైన్లు వేశామన్నారు. మారికవలసలో రూ. 13 లక్షలతో రోడ్డు, కాలువలు నిర్మిస్తున్నామని, మార్కివలస నుంచి ఓజోన్ వ్యాలీ కాలనీకి వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, అప్పలరాజు, వెంకటరమణ, సోంబాబు, శ్రీను, ముచ్చి రామనాయుడు, శివ, రవికుమార్, పాల్గొన్నారు.





సీ హార్స్ రెస్టారెంట్ తీరం వద్ద సుందరంగా కనిపిస్తున్న శిలలు

అలరిస్తున్న శిలల సౌందర్యం

- భీమిలి తీరంలో ఆకట్టుకుంటున్న బీచ్ రాక్స్
- అలల సవ్వడి మధ్య శిలల అందం
- తిలకించి, మురిసిపోతున్న సందర్శకులు

బీచ్‌రోడ్‌లో సీ హార్స్, మార్లిన్ కే రెస్టారెంట్‌ల మధ్య ఉన్న సీ రాక్స్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సముద్ర కెరటాల ఒడ్డున ఉన్న ఈ శిలల ఆకృతులను చూసి సందర్శకులు మైమరిచిపోతున్నారు. ఎత్తైన ఇసుక తిన్నెల వద్ద ఉన్న రాళ్లు సముద్రపు నీటిలో నానిపోవడం వల్ల నాచుపట్టి ఆకు పచ్చగా మరింత అందంగా కనిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి కెరటాల తాకిడికి కోతకు గురైన రాళ్లు వివిధ ఆకృతుల్లోకి మారుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ ఇక్కడికి పర్యాటకులు తరలివచ్చి, తీరం అందాలను వీక్షిస్తున్నారు.

- భీమునిపట్నం, ఆంధ్రజ్యోతి



ఆకుపచ్చని రంగుతో ఆకర్షిస్తున్న సీ రాక్స్

యోగ నారసింహుడిగా అప్పన్న దర్శనం



తిరువీధిలో పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

సింహాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులకు యోగానారసింహుడిగా శుక్రవారం దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని యోగాసన ముద్రలో ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి, పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితులు వేద మంత్రోచ్చారణలు, కళాకారుల కోలాటం, భక్తుల హరినామస్మరణ నడుమ మాడవీధుల్లో తిరువీధి వైభవంగా జరిపారు. మార్గమధ్యంలో భక్తులు ఫలాలు సమర్పించి, కర్పూర నీరాజనాలు ఒసగి ఆహ్వానం పలికారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



పరీక్షల్లో భాగంగా అభ్యర్థుల పరుగు

విశాలాక్షినగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు శుక్రవారం కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. అన కాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో 333 అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు ఎస్. బాలసూర్యారావు, ఎల్. మన్మథరావు, బి. రామకృష్ణారావు, టి. కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు

పద్మనాభం రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వాలు కోటి దాటడం పట్ల ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో సభ్యత్వాలునమోదు కావడం ఇదే ప్రథమమని చెప్పారు. నియోజకవర్గంలోనూ పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు జరిగాయన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివా రిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ఎండాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ ఏసీపీ కార్యాలయం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒమ్మి శ్యామల (47) మద్దిలపాలెంలోని ఆదిత్యనగర్ ప్రాంతంలో ఉన్న రేణు రెసిడెన్సీలో ఫ్లాట్ నెంబర్ 201లో నివాసం ఉంటుంది. ఆనందపురంలో పూలు కొనడానికి అల్లుడితో కలిసి బైక్‌పై వెళుతుండగా ఎండాడ ఏసీపీ కార్యాలయం ప్రాంతానికి వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో శ్యామల రోడ్డుపై పడిపోవడంతో లారీ వెనుక చక్రాలు ఆమె పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి ..

పద్మనాభం : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందినట్టు సీఐ సీహెచ్ శ్రీధర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని మద్ది జంక్షన్ నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గంలో ముత్యాలమ్మ గుడి సమీపంలో శుక్రవారం రాత్రి 8.35 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన జుత్తిక అప్పన్న (35) నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పద్మనాభం పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా అప్పన్న ట్రాక్టరు డ్రైవరుగా పని చేస్తుంటారు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు. అతని మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

సింహాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నియంత్రించాలని గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌తో కలిసి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు.

ఆనందపురం జంక్షన్‌లో కుక్కల బెడద

ఆనందపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జంక్షన్‌లో కుక్కల బెడద ఎక్కువైంది. ప్రతిరోజూ ఎవరో ఒకరు వాటి బారిన పడుతున్నారు. ఈ జంక్షన్‌కు మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, వ్యాపారులు నిత్యం వస్తుంటారు. అలాగే నిత్యం వందల సంఖ్య లో వాహనాలు తిరుగుతుంటాయి. జంక్షన్‌లో ఉన్న చేపలు, చికెన్, మటన్ దుకాణాల నిర్వాహకులు వాటి వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేస్తున్నారు. కుక్కలు వాటి కోసం జంక్షన్ పరిసర ప్రాం తాల్లో తిష్ట వేస్తున్నాయి. ఒక్కసారిగా గుంపుగా వస్తుండడంతో సానికులు భయాందోళన చెందుతు న్నారు. కొన్ని వాహనాల వెంట పరుగులు తీస్తూ.. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల ఇద్దరు చిన్న పిల్లలపై కుక్కలు దాడి చేసి, తీవ్రంగా గాయపరచడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. జంక్షన్ పరిసర ప్రాంతాల్లో రోజురోజుకు వాటి బెడద ఎక్కువ కావడంతో వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



జంక్షన్‌లో ఉన్న కుక్కల గుంపు

కనుమరుగు కానున్న జూట్‌మిల్లు స్కూల్

- వందేళ్ల క్రితం ఏర్పాటు
- పాఠశాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేసిన మిల్లు యాజమాన్యం
- ఇప్పటికే స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం
- మరికొద్ది రోజుల్లో భవనాలు కూల్చివేత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

తగరపువలస, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం ఆధ్వర్యంలో వందేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ ప్రాథమిక పాఠశాల శాశ్వతంగా మూతపడిపోయింది. మిల్లు యాజమాన్యం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎయిడెడ్ పాఠశాలను ఏర్పాటు చేసి, సొంతంగా భవనాన్ని నిర్మించింది. ఇందులో ఎంతోమంది ప్రముఖులు చదువుకున్నారు. ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ కూడా ప్రాథమిక విద్య ఇక్కడే అభ్యసించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ వంద మందికి తక్కువ కాకుండా విద్యార్థులు చదివేవారు.పాఠశాలలో తోలేటి అనే కవి కూడా ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2009లో మిల్లు మూతపడిన తరువాత కూడా దీన్ని నిర్వహించారు. ఇటీవల మిల్లు తనకున్న స్థలాలను అమ్మకాలు చేయడం వల్ల పాఠశాల, దానికి కేటాయించిన క్రీడా మైదానం ఎకరా భూమిని కూడా అమ్మకం చేశారు. కొనుగోలుదారులు ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి పాఠశాలను ఎత్తివేశారు. అప్పటికే సరిగ్గా జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న ఈ పాఠశాలలో కొత్త నియామకాలు జరగలేదు. పదవీ విరమణ చేసిన వారి వల్ల ఉపాధ్యాయుల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఇందులో చదువుతున్న విద్యార్థులు సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. దీంతో పాఠశాల అస్థిత్వం కోల్పోయినట్లయింది. ఎంతో చరిత్ర కలిగిన ఫ్యాక్టరీ పాఠశాలగా చెప్పుకోవడానికి మాత్రమే మిగిలింది. పరిసర ప్రాంతంలో భూములు కొనుగోలు చేసిన వారు ఇక్కడ లేఅవుట్ వేయడానికి ప్రయత్నిస్తున్నారు.పాఠశాల సమీపంలో పురాతనమైన చర్చి, కొన్ని ఇళ్లు కూడా ఉన్నాయి. తమకు పట్టాలున్నాయని ఎన్నో ఏళ్లుగా తాము ఇక్కడ నివసిస్తున్నామని వారంతా ఆందోళన చేయడంతో ఆ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అన్ని కట్టడాలు కూల్చివేసినా.. పాఠశాల ఉంటుందని ఐదేళ్ల క్రితం సున్నాలు వేశారు. కానీ దీన్ని పడగొట్టే అవకాశం ఉంది.



జూట్‌మిల్లు యాజమాన్యం నిర్మించిన పాఠశాల భవనాలు



కాంప్లెక్సు నిర్మాణానికి చదును చేసిన స్థలం

ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణమెన్నడో?

- తగరపువలసలో వృథాగా ప్రభుత్వ స్థలం
- పట్టని పాలకులు, అధికారులు

తగరపువలస, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కూడలిలో బస్సు కాంప్లెక్సు నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం వృథాగా ఉంది. విశాలంగా ఉంటుందని పట్టణ ఆవతల అధికారులు ఓ స్థలాన్ని ఎంపిక చేసి, నిర్మాణానికి ప్రయత్నించారు. ఈమేరకు అక్కడ ఆక్రమణలు తొలగించి స్థలాన్ని చదును చేశారు. దీంతో కొండపేట, చిట్టివలస సరిహద్దులో ఉన్న ఈ స్థలంలో కాంప్లెక్సుకు అన్ని అడ్డంకులు తొలగించి ఒక టెర్మినల్ (బే) నిర్మాణానికి అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. అనంతరం కాంప్లెక్సు, డిపో రెండూ ఒకే ప్రాంతంలో ఉండాలని ఊరవతల మరో స్థలాన్ని ఎంపిక చేసి ప్రతిపాదన తయారు చేయడంతో టెర్మినల్ (బే) స్థలాన్ని ఖాళీగా వదిలిపెట్టారు. ఇందులో ప్రస్తుతం కొంతభాగంలో అన్న క్యాంటీన్ నిర్మించారు. ఈ స్థలంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరెడ్డి శంకుస్థాపన చేశారు. ఇక్కడ కొంత కాలం మినీ బస్సు కాంప్లెక్సు పేరు పెట్టి సిటీ బస్సులను నిలుపు చేసేవారు. విశాఖ, విజయనగరం, భీమిలి నుంచి వచ్చే బస్సులు ఇందులో నిలిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇక్కడ కంట్రోలర్‌ను కూడా నియమించారు. ఈ స్థలంలో నిర్మాణ పనులు జరిగే సమయంలో విజయనగరం వెళ్లే రూటులో ఏడు ఎకరాల స్థలాన్ని కాంప్లెక్సు కోసం ఎంపిక చేసి శంకుస్థాపన చేశారు. దీంతో మినీ బస్సు కాంప్లెక్సు పనులు ఆగిపోయాయి. కొత్తగా గుర్తించిన ప్రాంతంలో కాంప్లెక్స్ నిర్మిస్తారని ఆశించినా, కనీసం పనులు ప్రారంభం కాలేదు. తగరపువలసలో సిటీ బస్సులు నిలిపే స్థలం లేక రోడ్డు పక్క, దుకాణాల ఎదుట ఆపుతున్నారు. ఊర వతల కాంప్లెక్సు నిర్మాణం జరిగే వరకు తొలుత కేటాయించిన పాత స్థలంలో బస్సులను నిలిపేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీకొక మోడల్ పాఠశాల

... 1వ పేజీ తరువాయి

యూపీ, ఉన్నత పాఠశాలలు 562 ఉన్నాయి. వీటిలో 69,285 మంది చదువుతున్నారు. ప్రభుత్వ, మండల పరిషత్, జీవీఎంసీ పరిధిలో 447 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వాటిలో 42 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంకా మూడు యాజమాన్యాల కింద 29 యూపీ పాఠశాలలుండగా, ఎనిమిదిచోట్ల 60కు మించి విద్యార్థులు ఉన్నారు. ఆ ఎనిమిది పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. మిగిలిన 21 పాఠశాలల్లో 60 మంది కంటేతక్కువ పిల్లలు ఉన్నందున వాటిని ప్రాథమిక పాఠశాలలుగా మార్చి అక్కడ చదువుతున్న 6,7,8 తరగతుల పిల్లలను సమీపంలో ఉన్నత పాఠశాలలకు పంపుతారు.

జిల్లాలో 86 ప్రభుత్వ, జడ్పీ, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 40 పాఠశాలల్లో 3,4,5 తరగతులు నిర్వహిస్తున్నారు. వీరంతా గతంలో ఎక్కడ నుంచి వచ్చారో తిరిగి అదే ప్రాథమిక పాఠశాలలకు పంపుతారు. ఈ క్రమంలో ఒక పంచాయతీలో 60 లేదా అంతకుమించి పిల్లలు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఒకదానిని మోడల్ పాఠశాలగా ఎంపిక చేస్తారు.

ఇక 60 మంది పిల్లలున్న ప్రాథమిక పాఠశాలలకు ఐదుగురు చొప్పున (ప్రతి పాఠశాలకు ఒక టీచర్) ఉపాధ్యాయులను ఇస్తారు. ఒకవేళ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 146 ఉంటే ఐదుగురు ఎస్జీటీలు, ఒక హెచ్‌ఎం పోస్టు కేటాయిస్తారు.దీనిపై మండల విద్యాశాఖాధికారులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి సమాచారం సేకరించే పనిలో ఉన్నారు. జీవో 117 రద్దు నేపథ్యంలో ఆరు రకాల పాఠశాలల స్థానంలో ఐదు కేటగిరీల పాఠశాలలు రానున్నాయి. ఈ క్రమంలో పాఠశాల విద్యా శాఖ కమిషనర్ విజయరామరాజు ఈనెల 20వ తేదీ నుంచి ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు.

ఉక్కుకు మంచి రోజులు

... 1వ పేజీ తరువాయి

ప్రకటించిన నేపథ్యంలో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా కర్మాగారం ప్రయాణం మొదలవుతుంది. దీనివల్ల ఉద్యోగులకు భద్రత లభిస్తుంది. యాజమాన్యం ప్రస్తుతం వీఆర్ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానించింది. భవిష్యత్తుపై ఆందోళనతో 370 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు ప్యాకేజీ రావడంతో అత్యధికులు వీఆర్ఎస్‌కు మొగ్గుచూపరనే వాదన వినిపిస్తోంది. అనారోగ్యం, తక్కువ సర్వీస్ ఉన్నవారు తప్పితే మిగిలిన వారు కొనసాగుతారని ఉద్యోగ సంఘాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. ఉత్పత్తికి అవసరమైన ఐరన్‌ఓర్‌ను ఎన్ఎండీసీని అందించి, అదానీ గంగవరం పోర్టు నుంచి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటే అనుకున్న ఉత్పత్తి సాధిస్తామని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

నేడు స్వచ్ఛ దివస్

... 1వ పేజీ తరువాయి

నిషేధించామని, గ్రామీణ ప్రాంతంలో కూడా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఈశనివారం ప్రభుత్వ విద్యా సంస్థలకు సెలవు కావడంతో ఈ నెల నాలుగో శనివారం స్వచ్ఛ దివస్ అమలు చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ దివస్ సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలను ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలని తద్వారా ప్రజలు స్ఫూర్తి పొందుతారని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, పాల్గొన్నారు.

సాంకేతికతలో స్వావలంబన సాధించాలి

... 1వ పేజీ తరువాయి

విద్య, అనువర్తిత పరిశోధన, సాంకేతికత, ఉత్పత్తి అభివృద్ధి (అప్లయిడ్ రీసెర్చ్), పరిశ్రమల మధ్య సమన్వయంలో వెనుకబడి ఉన్నామని పేర్కొంటూ దానిని అధిగమించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి ప్రక్రియను నడిపించడంలో సాంకేతిక బదిలీ, పరిశ్రమల సహకారం కీలకమని, దానిని విస్మరించరాదన్నారు. సాంకేతికతలో స్వావలంబన సాధించినప్పుడే దేశం పురోగతి సాధిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రధాని ఆకాంక్షించిన ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా సాంకేతిక రంగంలో స్వావలంబన దిశగా ముందుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఎం గవర్నింగ్ బాడీ సభ్యురాలు మాళవిక ఆర్.హరిత మాట్లాడుతూ 'విద్యా పరమ దైవతం (జ్ఞానం అత్యున్నత దేవత)' అని భర్తృహరి రాసిన నీతి శతకంలో పదబంధాన్ని ప్రస్తావిస్తూ విద్య ప్రాధాన్యం వివరించారు. విద్య, జ్ఞానం, అభివృద్ధి, సామరస్యం, పురోగతిని పెంపొందించడంలో ఐఐఎంవి ముందువరుసలో ఉండాలని ఆకాంక్షించారు. ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ గడచిన పదేళ్లుగా అన్ని ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతుందన్నారు. సంస్థలు/పరిశ్రమలను సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా విద్యార్థులలో నాయకత్వ లక్ష్యాలు పెంపొందించేలా వారిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతిభ కనబర్చిన ఎనిమిది మంది విద్యార్థినీ, విద్యార్థులకు డాక్టర్ కామత్ ప్రశంసాపత్రాలతోపాటు గ్రాంట్లు అందజేశారు. సంస్థ డీన్ ఆచార్య కావేరి కృష్ణన్ స్వాగతం పలకగా అకడమిక్ డీన్ ఎం.విజయ భాస్కర్ వందన సమర్పణ చేశారు.

బాబు కృషి వల్లే ఉక్కుకు భారీ ప్యాకేజీ

టీడీపీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలించిందని టీడీపీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ కొనియాడారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం ప్యాకేజీ ప్రకటించిన సందర్భంగా జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్యాకేజీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ నినాదాలు చేశారు. అంతకు ముందు సుధాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారానికి రివైవల్ ప్యాకేజీ కింద కేంద్రం రూ. 11,500 కోట్లు ప్రకటించిందన్నారు.

రాష్ట్రంలో ఐదేళ్లపాటు పాలించిన వైసీపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిరక్షణను గాలికి వదిలేసిందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహనరెడ్డి సొంత ప్రయోజనాల కోసం కేంద్రంతో సంప్రదింపులు జరిపారు తప్ప విశాఖ ఉక్కు కర్మాగారం కోసం మాట్లాడలేదని విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు వైసీపీ ఒక్క మేలు కూడా చేయలేదన్నారు. అధికారంలో ఉన్న సమయంలో నాకెంత.. మీకెంత? అన్న చందంగా పాలన చేశారని దుయ్యబట్టారు. సైకో పాలన నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడిప్పుడే తేరుకుంటోందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్యాకేజీ ప్రకటించిన ఎన్డీఏ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఉరికిటి నారాయణరావు, విల్లూరి భాస్కరరావు, పార్టీ నాయకులు బంటుపల్లి సూర్యనారాయణ, ఐతా మధు, ఉరికిటి గణేష్, కోరాడ చిన్న, బంగారు రవిశంకర్, సారిపల్లి మహేష్, గణపతి, ముక్కి రామకృష్ణ, పొడుగు కుమార్, షేక్ జుబేర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి

» పకడ్బందీ చర్యలు తీసుకొంటున్న జోన్-3 అధికారులు » చిరు వర్తకులతో సమన్వయం » ముమ్మరంగా అవగాహన సదస్సులు

మద్దిలపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం పెను ప్రమాదంగా మారింది. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల పర్యావరణానికే కాదు ఆరోగ్యానికి కూడా ముప్పేనని పర్యావరణ వేత్తలు, వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ ఈ రోజుల్లో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. ఇంటాబయట తినడానికి ఎక్కువగా ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు ఉపయోగిస్తున్నారు. ఇంటికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేయడానికి సైతం ప్లాస్టిక్ సంచుల వినియోగమే ఎక్కువైంది. ఉదయం రోడ్లపై వేసే చెత్తలో అత్యధికంగా కనిపించే ప్లాస్టిక్ కవర్లు, వస్తువులే దీనికి నిదర్శనం. పర్యావరణం, ఆరోగ్యం దృష్ట్యా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించడంతో జీవీఎంసీ జోన్-3 పరిధిలో అధికారులు ప్లాస్టిక్ నివారణపై దృష్టి సారించారు...



చిరు వర్తకులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన

జీవీఎంసీ జోన్-3 పరిధిలో ట్రేడ్ లైసెన్స్ పొందిన దుకాణాలు సుమారు 6 వేలు ఉన్నాయి. లైసెన్స్ లేకుండా వీధి వ్యాపారాలు, ఇతరులు 3 వేల వరకు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఆయా దుకాణాల్లో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా ఉండేందుకు శానిటరీ విభాగం అధికారులు కసరత్తు చేస్తున్నారు. జోన్, వార్డు స్థాయిలో వ్యాపారస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ వార్డుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటరీ కార్యదర్శులు దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా టిఫెన్, టీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్, మాంసం, కూరగాయల దుకాణాలు, పూలు, హోటల్స్, వీధి వ్యాపారుల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీధి వ్యాపారులకు ప్లాస్టిక్ వస్తువులపై అవగాహన కల్పిస్తున్నారు. టీ దుకాణాదారులకు ప్లాస్టిక్ గ్లాసులకు బదులు గాజు, స్టీల్ గ్లాసులు వినియోగించాలని సూచిస్తున్నారు. దుకాణదారులు 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా 120 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ప్లాస్టిక్ వస్తువులు తయారు చేసే వ్యాపారస్తుల వివరాలు సైతం వ్యాపారస్తులకు తెలియజేస్తున్నారు. ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వ్యాపారస్తులకు ప్లాస్టిక్ తయారీదారుల ఫోన్ నంబర్లు ఇచ్చి వారి వద్ద కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. తక్కువ మందం, ఎక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులకు ధరలో కూడా వ్యత్యాసం లేనందున 120 మైక్రాన్ల కవర్లు, కప్పులు వినియోగించాలని అవగాహన కల్పిస్తున్నారు.



జాలారిపేటలో అవగాహన కల్పిస్తున్న శానిటరీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

ప్రజల్లోనూ చైతన్యం రావాలి



ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. తమ పరిధిలోని ప్రతీ దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా తనిఖీలు నిర్వహిస్తున్నాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై చిరు వర్తకులతో ప్రత్యేక సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. 120 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు వినియోగించాలని సూచించాం. ముఖ్యంగా ప్లాస్టిక్ నివారణపై ప్రజల్లో కూడా చైతన్యం రావాలి. ప్లాస్టిక్ వినియోగిస్తే ఎంత ప్రమాదామో తెలుసుకోవాలి.

- బి.ప్రసాదరావు, జోన్-3 వైద్యాధికారి

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు



వినతులను స్వీకరిస్తున్న సీపీపీ

వెంకోజీపాలెం, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు సంబంధించి 8 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2వ జోన్ నుంచి 02, 3వ జోన్ నుంచి 3, 4వ జోన్ నుంచి 1, 6వ జోన్‌కు 02 వినతులు వచ్చాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

లోడర్ కాంట్రాక్టర్ మహాదోపిడీ

సిరిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : లోడర్ కాంట్రాక్టర్ మహాదోపిడీ చూస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని అందుకే కార్మికులు ఆందోళనలు చేస్తున్నారని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సీఐటీయూ పి.వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. లోడర్స్ లేబర్ కాంట్రాక్టు ఒప్పందం చెల్లదని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ లేకుండా కౌన్సిల్ ఎలా ఆమోదించిందని ప్రశ్నించారు. రూ.450 రోజు వేతనం ఏ జీవో ప్రకారం నిర్ణయించారని చెప్పాలని ప్రశ్నించారు. మున్సిపల్ సర్క్యులర్లు ఏం చెబుతున్నాయని అన్నారు. జీవీఎంసీలో టెండర్ విధానం లోపభూయిష్టం దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని తెలిపారు.

కుక్కను చంపిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ స్టేషన్ పరిధిలో ఓ వీధి కుక్కను చంపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు అందింది. దయా యానిమల్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ ఎంవీపీ పోలీసులకు శుక్రవారం రాత్రి ఈ ఫిర్యాదు చేసింది. సంస్థ ప్రతినిధులు తెలిపిన వివరాల మేరకు.. జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీ కాలనీ 9వ సెక్టరు ప్రధాన రహదారిని ఆనుకుని ఓ కుక్కను రాళ్లతో మోది చంపినట్టు సంస్థ ఫిర్యాదు చేసింది. గురువారం సాయంత్రం కుక్క చనిపోయి ఉన్నట్టు గమనించి, తాము వీడియో తీస్తుండగా ఓ వ్యక్తి తానే కుక్కను చంపినట్టు తెలిపాడన్నారు. కుక్క కళేబరం అక్కడి నుంచి తరలించారని పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. వీధి కుక్కలను కూడా హింసించడం నేరమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, సదరు వ్యక్తి ఎవరు అన్నది విచారణ చేస్తున్నట్లు సీఐ మురళీ తెలిపారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 50, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 46, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 46, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 46, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీర దోస 40, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 44, కంద 72, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాళి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 46, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

మహిళలకు స్ఫూర్తి కమలా హారిస్

మాజీ మేయర్ రాజాన రమణి



ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాసిన 'సమరశీల ధీర వనతి కమలా హారిస్' పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న రాజాన రమణి

సిరిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో ముందుకు సాగి ఎందరికో ఆదర్శంగా నిలిచిన గొప్ప మహిళ అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అని నగర మాజీ మేయర్ రాజాన రమణి పేర్కొన్నారు. భారత మూలాలు ఉన్న ఆమె ఎన్నో కీలక పదవులను అధిరోహించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాసిన 'సమరశీల ధీర వనతి కమలా హారిస్' గ్రంథాన్ని ఆంధ్రా యూనివర్సిటీ హిందీ విభాగ సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజాన రమణి గ్రంథావిష్కరణచేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా అమెరికాలోని ఏర్పాటు చేసిన సెక్స్ వెబ్‌సైట్ ద్వారా టీనేజీ యువత చెడు దారిలో వెళ్తుందని గుర్తించి దానిపై నిరంతరం పోరాడి ఆ వెబ్‌సైట్ నిషేధించగలిగారన్నారు. భవిష్యత్‌లో కమలా హారీస్ మరిన్ని పదవులు అధిరోహిస్తారని ఆమె ఆకాంక్షించారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఉన్నత శిఖరాలకు ఎదిగిన కమలా హారీస్‌ను తన రచన ద్వారా పరిచయం చేయడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య రజిని మాట్లాడుతూ పదకొండు చాప్టర్లతో అమెరికా రాజకీయాలు, వ్యక్తుల గురించి యార్లగడ్డ చక్కగా ఈ పుస్తకంలో వివరించారన్నారు.

గ్రంథ స్వీకర్త పొట్రూ బ్రహ్మానందం మాట్లాడుతూ తన పేరును స్వీకర్తగా ప్రకటించడం ఆనందందన్నారు. సభాధ్యక్షత వహించిన పుస్తక రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ 11 ఏళ్ల కిందట తనకు అమెరికాపై ప్రేమ పెరిగిందని గుర్తుచేశారు. దానికి కారణం జాన్ కెనెడీ అన్నారు. చైనా మనతో యుద్ధం చేసినప్పుడు భారతదేశానికి మద్దతుగా కెనెడీ నిలబడటంతో ఆయనపై అభిమానం కలిగిందన్నారు. వాషింగ్టన్‌లో కెనెడీ, నెహ్రూ నడిచిన ఫోటో అప్పట్లో క్యాలెండర్‌గా వచ్చిందని తెలిపారు. అధిక శాతం మంది భారతీయులు అమెరికాలో ఉన్నారని, అయితే సెలవులకు అయినా మాతృదేశానికి వారు రావడానికి ఇష్టపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వందేళ్ల క్రితం ట్రంప్ తాత జర్మనీ నుంచి అమెరికాకు వచ్చారని, డబ్బులు సంపాదించుకొని తిరిగి జర్మనీ వెళ్లారని, అయితే వారి పిల్లలు తిరిగి మాతృదేశానికి వెళ్లడానికి ఇష్టపడటం లేదని తెలిపారు. అదే విధంగా ఇక్కడి నుంచి వెళ్లిన భారతీయులు అమెరికాలో స్థిరపడి రాజకీయాల్లోకి ప్రవేశించారని, ట్రంప్ తరహాలో భారతీయులు కూడా అక్కడ అధ్యక్షులు కావాలని ఆకాంక్షించారు. భారతీయులు కూడా రాజకీయాల్లో అక్కడ ప్రాధాన్యం వహించాలని ఆ ఉద్దేశంతోనే తాను పుస్తకం రాసినట్టు చెప్పారు. సభలో ఆచార్య బాలమోహన్‌దాస్, సుగుణ, కేవీ రావు, దసపల్లా హోటల్స్ అధినేత ఎం.రాఘవేంద్రరావు, డాక్టర్ కేవీ ప్రసాద్, అట్లూరి ఉషారాణి, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

మొదలైన పరసల సందడి



పరస ఉత్సవంలో పూజలు అందుకుంటున్న సీతారాములు

వెంకోజిపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 17 వార్డులోని కొత్తవెంకోజిపాలెంలో శ్రీకోదండ రామ లీలా పరస మహోత్సవం శుక్రవారం కన్నుల వేడుకగా కొనసాగింది. స్థానిక గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పరసలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిరువ్యాపారులు పలు గృహోపకరణాలను విక్రయించారు. ఈ సందర్భంగా గ్రామం మధ్యలో ఉన్న రామాలయాన్ని అత్యంత సుందరంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతోపాటు జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత ఆలయాన్ని దర్శించుకునేందుకు ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కన్నుల వేడుకగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఈ ప్రాంతమంతా కనువిందు కలిగించింది. సాముగరిడీ, కోలాటం, నేలవేషాలు, బుర్రకథ తదితర జానపద కళా ప్రదర్శనలతో ఇక్కడికి వచ్చిన వారిని అలరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు, టీడీపీ నాయకులు కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, మద్దాల వీర వెంకటప్పారావు, ఎస్.నరసింహారెడ్డి, ఆడారి కామేశ్వరరావు, యర్రాజీ రెడ్డి, గ్రామస్థులు ఆడారి శ్రీను, పీల జోష్యుల, మద్దాల భాను, ఇతర గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుకతోట నెత్తల పరస

స్థానిక 16వ వార్డులోని ఇసుకతోటలో నెత్తల పరస శనివారం జరుగనుంది. ఈ సందర్భంగా గ్రామంలోని సూరిశెట్టి కుటుంబీకులు నిర్మించిన నంది ఆలయంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం సంబరం సాగనుంది. అలాగే ఈ నెలలోనే మద్దిలపాలెం, రేసపువానిపాలెం, పెదవాల్తేరు, పాత వెంకోజీపాలెం, ఆరిలోవ ప్రాంతాలలో పరస మహోత్సవాలు నిర్వహించనున్నారు.



పరస సందర్భంగా ఏర్పాటైన అంగడి

కలాం పార్కులో పారిశుధ్యం పనులు

మిగతా శాఖల అధికారులు స్పందించకపోవడంపై స్థానికుల అసంతృప్తి

వెంకోజీపాలెం, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎంతగా గోల పెట్టినా, పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా కొన్ని శాఖల్లో కదలిక అన్నదే లేకుండాపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యపై అన్న శాఖలు స్పందించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఏదో ఒక శాఖ అధికారులు మాత్రం స్పందించి, మిగతా వారు మిన్నకుంటున్నారు. దీనివల్ల సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కు దుస్థితి గురించి శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అధ్వానంగా కలాం పార్కు' శీర్షికన కథనం రావడంతో పారిశుధ్య సిబ్బంది వెంటనే స్పందించారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది వెంటనే స్పందించి శుక్రవారం పార్కును శుభ్రం చేశారు. కానీ పార్కు అభివృద్ధిని పట్టించుకోవాల్సిన కార్పొరేటర్, అసాంఘిక కార్యకలాపాలు ఆపాల్సిన పోలీసు శాఖ, పార్కును అభివృద్ధి చేయాల్సిన జీవీఎంసీ హార్టికల్చర్ శాఖ, బహిరంగ ప్రదేశాలలో పశువుల సంచారాన్ని నియంత్రించాల్సిన జీవీఎంసీ పశు సంవర్ధక శాఖ అధికారులు కనీసంగా స్పందించకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్కు దుస్థితి గురించి అనేక సార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా కేవలం పారిశుధ్య సిబ్బంది మాత్రం స్పందిస్తున్నారని, మిగతా శాఖల వారు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు సైతం ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కార్పొరేటర్‌కు నాలుగేళ్లు గడిచినా పార్కు అభివృద్ధి చేయాలనిపించలేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై అన్ని శాఖల అధికారులు స్పందించాలని, పార్కు అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు, పార్కుకు వచ్చే వృద్ధులు, ఆటగాళ్లు, కరాటే శిక్షకులు కోరుతున్నారు.

సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు వినియోగదారులకు భారంకానున్న సెకీ ఒప్పందాన్ని తక్షణం రద్దు చేయాలని ఈఆర్‌సీని రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ కోరారు. ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈఆర్సీ రాష్ట్ర సలహాకమిటీ సమావేశంలో పాల్గొన్న ఠాకూర్‌రామ్ సింగ్‌కు ఈ వినత పత్రం అందజేశారు. విద్యుత్తు వనరుల ప్రణాళికలో భాగంగా రాబోయే అయిదేళ్లలో 10,800 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు, 7 వేల మెగావాట్ల సెకీ విద్యుత్తు గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల గ్రిడ్‌కు పునరుత్పాదక మిశ్రమం పెరుగుతుందని, దీనివల్ల నిర్వాహణ కష్టతరమవుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆర్‌ఈసీఎస్‌లు రద్దు అవుతున్న నేపథ్యంలో కశింకోట, చీపురుపల్లి, ఆర్సీఎస్‌లు ఈపీడీసీఎల్ పర్యవేక్షణలోనే కొనసాగించాలని కోరారు. దీనిపై రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా 2020, జనవరి 13 నాటి తీర్మానానికి కట్టుబడి ఉండాలని ఆయన పేర్కొన్నారు.



ఈఆర్సీ చైర్మన్ ఠాకూర్‌రామ్ సింగ్‌కు వినత పత్రం అందజేస్తున్న వెంకటరమణ

నా రాజీనామాకు సార్థకత

» స్టీల్‌ప్లాంట్‌కు సాయంపై భీమిలి ఎమ్మెల్యే వ్యాఖ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవానికి కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించడంతో తన రాజీనామాకు సార్థకత లభించినట్లయిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఎంవీపీ కాలనీలోని తన స్వగృహంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా చూస్తామన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నపుడు స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణపై కేంద్రం ప్రకటనను నిరసిస్తూ తాను 2021 ఫిబ్రవరి 12న స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా చేసిన విషయాన్ని, పాతికేళ్ల క్రితం సీఎం చంద్రబాబు నాయుడు ఇదే ప్రతిపాదనపై అప్పటి ప్రధాని వాజ్‌పేయి హయాంలో అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీతో సంప్రదింపులు జరిపి భారీ ప్యాకేజీ వచ్చేలా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజయనగరం జిల్లా గర్భాంలో మాంగనీసు గనుల లీజును మరో పదేళ్లు పునరుద్ధరించిన సంగతిని గుర్తుచేశారు. అంతకుముందు ఆయన ఇంటి ముందు బాణసంచా కాల్చి హర్షం ప్రకటించారు. కార్పొరేటర్లు పీవీ నరసింహం, లొడగల అప్పారావు, భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు, కూటమి నాయకులు రామానాయుడు, శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి తిరుగు ప్రయాణానికి 70 ప్రత్యేక సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తిరుగు ప్రయాణికుల రవాణాకు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం శుక్రవారం 70 ప్రత్యేక సర్వీసులను నడిపింది. సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రయాణికులను తమ స్వస్థలాలకు చేర్చేందుకు ఈ నెల 9 నుంచి 13వరకు షెడ్యూల్ సర్వీసులు, ప్రత్యేక సర్వీసులు నడిపింది. సంక్రాంతి అనంతరం తిరిగి తమ గమ్యస్థానాలకు ప్రయాణమైన వారికి రవాణా సేవలు అందించేందుకు ఆర్టీసీ శుక్రవారం షెడ్యూల్ సర్వీసులతో పాటు 70 ప్రత్యేక సర్వీసులు నడిపింది. హైదరాబాద్‌కు 5, విజయవాడకు 10, కాకినాడకు 2, రాజమండ్రికి 3, భీమవరానికి3, శ్రీకాకుళానిని 15, ఇచ్ఛాపురానికి 4, పలాసకు 3, టెక్కలి 2, రాజాం3 విజయగరానికి 8, పార్వతీపురం 5, సాలూరు 4, పాతపట్నం 3 ప్రత్యేక సర్వీసులు నడిపింది. ఈ ప్రాంతాలన్నింటికి షెడ్యూల్ సర్వీసులు ఉన్నప్పటికీ అంతకుమించిన విధంగా సంక్రాంతి తిరుగు ప్రయాణికుల డిమాండ్ ఉండటంతో ఈ ప్రత్యేక సర్వీసులు నడిపారు.

జ్యోతిబసుకు ఘన నివాళి



జ్యోతిబసుకు నివాళి అర్పిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్రకుమార్, ఇతర నేతలు

ఆరిలోవ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేసిన నేతల్లో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఒకరని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్రకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం బీఎస్‌ఆర్ నగర్‌లో జ్యోతిబసు 15వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ మొట్టమొదట రైల్వే యూనియన్ స్థాపించి ఆ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. స్వాతంత్రోద్యమం నేపథ్యంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ బెంగాల్ కార్మిక వర్గాన్ని రైతాంగాన్ని ఐక్యం చేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. 1977లో బెంగాల్‌లో జ్యోతిబసు నాయకత్వంలో ప్రభుత్వ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిగా 22 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పరిపాలించారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు 35 కిలోల బియ్యం, 16 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడంలో దేశంలో నెంబర్ వన్ పరిపాలనాదక్షుడిగా పేరొందారన్నారు. పశ్చిమ బెంగాల్‌ను మత ఘర్షణ రహితంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో రమణ, సూర్యనారాయణ, నాగరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు,

గురివిళ్ల అప్పన్నకు సంగీత కళాభారతి బిరుదుతో సత్కారం



అప్పన్న దంపతులను సత్కరిస్తున్న కళాభారతి ట్రస్ట్ నిర్వాహకులు

మద్దిల పాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఆరాధన ట్రస్ట్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాదస్వర విద్వాంసులు గురవిళ్ల అప్పన్నకు సంగీత కళాభారతి బిరుదుతో సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు మంతెన సత్యనారాయణ మాట్లాడుతూ సంగీతాన్ని ప్రోత్సహించి మన కళలు కాపాడుకోవాలన్నారు. ప్రతీ ఏడాది ఇచ్చే సంగీత కళాభారతి బిరుదు ఈ ఏడాది గురువిళ్ల అప్పన్నకు అందివడం సంతోషంగా ఉందన్నారు. ఏడు రోజులు పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో 1100 మంది కళాకారుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు మాట్లాడుతూ అత్యున్నతమైన సంగీత కళాకారులకు ప్రతి ఏడాది సంగీత కళాభారతి అవార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకూ ఐవీఎల్ శాస్త్రీ, అరుంధతి, బాల కొండలరావు, జోగులాంబ, వంకాయల వెంకటరమణ, ముట్నూరి జలజాక్షి వంటి గొప్ప కళాకారులకు బిరుదు అందించామన్నారు.

అనంతరం త్యాగరాజ స్వామి సంగీత సద్భక్తి సమన్వయం కార్యక్రమంలో హంస విద్యార్థి అధ్యాపక బృందం గానాలు ఆలపించారు. వయోలిన్ రామ్ చరణ్, గాయత్రి, మృదంగంపై జి.వెంకటరావు, ఫ్లూట్ పై శైలపతి సహకార వాయిద్యం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీణ గాయత్రి, ట్రస్ట్ నిర్వహకులు పంతుల గోపాలరావు, పైడా కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేడు వీఎంఆర్డీఏలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్

సిరిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్, స్వచ్ఛ విశాఖ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్డీఏలో ప్రతీ 3వ శనివారం కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలు, అలాగే కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సంస్థ నిర్వహణలో ఉన్న అన్ని పార్కులలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, అదే విధంగా వీఎంఆర్డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని శతశాతం నిషేధించాలని కోరారు. క్లాత్ బ్యాగ్స్ , కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు. వీఎంఆర్డీఏలో సెంట్రల్ పార్కు వద్ద ఉదయం 10 గంటలకు, కార్యాలయంలోని 11.30 గంటలకు ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందన్నారు.

మహా కుంభమేళాకు పల్లా



ప్రయాగలో పల్లా శ్రీనివాసరావు

మహారాణిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగలో జరుగుతున్న మహాకుంభ మేళాలో శుక్రవారం ఆయన పాల్గొని, త్రివేణి సంగమంలో పుణ్యస్నానం చేశారు.

నేడు మాధవధారలో ఎన్టీఆర్ వర్ధంతి

మాధవధార, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అభిమాన సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని 50వ వార్డులో శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు వార్డు పార్టీ కార్యాలయం నుంచి బిర్లా జంక్షన్ ఎన్టీఆర్ స్మారక విగ్రహం వరకు ర్యాలీ చేపడతామన్నారు. అనంతరం అభిమానులు, పార్టీ కార్యకర్తలతో నందమూరికి నివాళి అర్పిస్తామని తెలిపారు.

నీటి శుభ్రత పాటిద్దాం!



డ్రై డే ప్రాముఖ్యతను తెలియజేస్తున్న జోన్-5 జెడ్సీ బి.రాము

మురళీనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు వారంలో ఒక రోజు నీటి శుభ్రతకు కేటాయిద్దామని జీవీఎంసీ జోన్-5 జెడ్సీ బి.రాము సూచించారు. వ్యాధుల నుంచి రక్షణగా మనమంతా కలసి అడుగేయాలని ఆయన ప్రజల్ని కోరారు. శుక్రవారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డులో ఆయన పర్యవేక్షణలో డ్రై డే.. డ్రై డే' కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వినియోగిస్తున్న నీళ్ల ట్యాంకులను ఒక రోజు పూర్తిగా ఎండబెట్టాలని (డ్రై), దీని ద్వారా హానికర బాక్టీరియా నశిస్తుందని పేర్కొన్నారు. తాగునీరు మాదిరిగా వాడుక నీటి నిల్వ ట్యాంకులకు వారంలో ఒక రోజు విరామం ఇవ్వాలని సూచించారు. జోన్-5 ఏఎంహెచ్ఓ సునీల్, శానిటరీ ఎస్ఎస్ జనార్ధన్, వార్డు శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలసి ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న చిన్న పాత్రలు, పూలకుండీలు, ఇతరత్రా వస్తువులు ప్రదర్శించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరప్రసాద్ పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం రేపు

మాధవధార, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గం 50వ వార్డు మురళీనగర్‌లో ఈ నెల 19న ఉదయం ఉచిత వైద్య సేవల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సేవలు పొందవచ్చన్నారు. ఓమ్ని హాస్పిటల్స్ సహకారంతో చేపడుతున్న వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్ సమస్యలను వైద్యులు పరీక్షించి నివారణకు సూచనలిస్తారని అన్నారు. మురళీనగర్, మాధవధార సహా నగరంలో ఎక్కడి వారైనా చికిత్సలకు హాజరు కావచ్చన్నారు. ఉచితంగానే వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు.

ఉక్కును కాపాడిన కూటమి

సీతంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకే కేంద్ర ప్రభుత్వం రూ.1,950 కోట్లు స్టీల్ ప్లాంట్‌కు సహాయం అందించిందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ కష్టకాలంలో ఉన్నప్పుడు తొలిసారి గతంలో సీఎంగా చంద్రబాబు, ప్రధానిగా వాజ్‌పేయి రూ.3 వేల కోట్లు ఇచ్చి నిలబెట్టారని ఆయన గుర్తుచేశారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా స్టీల్ ప్లాంట్‌కు ఆయన నామకరణం చేయాలని మూర్తియాదవ్ ప్రతిపాదించారు.

నిధుల కేటాయింపుపై హర్షం

అక్కయ్యపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, దాని అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు చర్చిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనకు ముందే రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు చెప్పారన్నారు. స్పందించిన కేంద్రం క్యాబినెట్‌లో కూటమి పెద్దలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌ల సూచనల మేరకు నిధులు కేటాయింపు ఆనందదాయకమన్నారు.

పార్కు అభివృద్ధికి తోడ్పాటు అందిస్తా..

జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్



సీతంపేట రాజేంద్రనగర్‌లో పార్కు స్థలం వివరాలను అధికారులు, స్థానికుల నుంచి తెలుసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్

సీతంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని పార్కు అభివృద్ధికి జీవీఎంసీ తరపున తోడ్పాటు అందిస్తామని కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. గ్రేటర్ విశాఖ జోన్-3 పరిధి 25వ వార్డు సీతంపేట, రాజేంద్రనగర్, కనకమ్మవారి వీధి తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో ఆయన అధికారులతో కలసి శుక్రవారం పర్యటించారు. రాజేంద్రనగర్‌లోని పార్కు వ్యర్థాలతో పేరుకుపోయిందని, ప్రజలకు ఆహ్లాదం పంచేలా అభివృద్ధి చేయాలని సూచించారు. పార్కు స్థలం వివరాలతో నివేదికను తనకు ఇవ్వాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఆదేశించారు. పార్కు ప్రాంతంలో వేసిన వ్యర్థాలను తొలగించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌కు సూచించారు. కనకమ్మ వారి వీధి వద్ద ఉన్న సులభ్ కాంప్లెక్సును పరిశీలించి రోజుకు ఎంతమంది వినియోగిస్తున్నారో నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. అవసరమైన మరమ్మతులు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం రాజేంద్రనగర్ పరిధిలోని రెల్లి వీధి నుంచి బుల్లయ్య కళాశాల ప్రధాన రహదారికి అనుసంధానం చేయాలని కార్పొరేటర్ కోరడంతో రోడ్డు విస్తరణకు ప్రజారోగ్యశాఖకు లేఖ రాయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ సంపత్‌కుమార్ సందర్శించి రోజూ ఎంతమంది వినియోగించుకుంటున్నారో ఆరా తీశారు. పక్కనే ప్రభుత్వ కంటి ఆసుపత్రి ఉన్నందున వృద్ధులు, వైద్యానికి వస్తున్న వారి కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వార్డులో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించటం లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదన రావు, ఏఎంఓహెచ్‌బి ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు ఫలించిన బాబు కృషి

టీడీపీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్, చిత్రంలో టీడీపీ నాయకులు

మహారాణిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలించిందని టీడీపీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ కొనియాడారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం ప్యాకేజీ ప్రకటించిన సందర్భంగా జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్యాకేజీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ నినాదాలు చేశారు. అంతకు ముందు సుధాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారానికి రివైవల్ ప్యాకేజీ కింద కేంద్రం రూ.11,500 కోట్లు ప్రకటించిందన్నారు.

రాష్ట్రంలో ఐదేళ్లపాటు పాలించిన వైసీపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిరక్షణను గాలికి వదిలేసిందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహనరెడ్డి సొంత ప్రయోజనాల కోసం కేంద్రంతో సంప్రదింపులు జరిపారు తప్ప విశాఖ ఉక్కు కర్మాగారం కోసం మాట్లాడలేదని విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు వైసీపీ ఒక్క మేలు కూడా చేయలేదన్నారు. అధికారంలో ఉన్న సమయంలో నాకెంత.. మీకెంత? అన్న చందంగా పాలన చేశారని దుయ్యబట్టారు. సైకో పాలన నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడిప్పుడే తేరుకుంటోందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్యాకేజీ ప్రకటించిన ఎన్డీఏ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఉరికిటి నారాయణరావు, విల్లూరి భాస్కరరావు, పార్టీ నాయకులు బంటుపల్లి సూర్యనారాయణ, ఐతా మధు, ఉరికిటి గణేష్, కోరాడ చిన్న, బంగారు రవిశంకర్, సారిపల్లి మహేష్, గణపతి, ముక్కి రామకృష్ణ, పొడుగు కుమార్, షేక్ జుబేర్ పాల్గొన్నారు.

మోదీ, బాబుల జోడీతోనే స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం

» ఇన్‌చార్జి మంత్రి దోలా

మహారాణిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల జోడీతోనే విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవం వస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ హయాంలో స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ అసమర్థ పాలనతోనే రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని విమర్శించారు. కేంద్రం సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇన్‌చార్జి మంత్రి స్పష్టంచేశారు.

కేంద్ర ప్రభుత్వానిది చరిత్రాత్మక నిర్ణయం

ఏపీ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వ్యాఖ్య



కాశీ విశ్వనాథరాజు

డాబాగార్డెన్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందని ఏపీ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను డిజెన్విస్టిమెంట్ నుంచి రీ ఇన్వెస్టిమెంటుకు తీసుకురావడంలో గత మూడు సంవత్సరాలుగా ఏపీ బీజేపీ చేస్తున్న కృషి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కలిసి ఈ చారిత్రాత్మక నిర్ణయంలో కీలక పాత్ర వహించాయన్నారు. సుమారు రూ.18 వేల కోట్లుతో రివైవల్ ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు పంపగా, అందులో రూ.11,440 కోట్లు మొదటి సంవత్సరం ఆర్థిక సాయంగా కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందన్నారు. విశాఖను దేశంలోనే ఒక ప్రముఖమైన స్టీల్‌ప్లాంట్‌గా చేయడానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. విశాఖ ఉక్కును స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో విలీనం చేయడమే శాశ్వత పరిష్కారమని, ఇది కూడా త్వరలో సాకారమవుతుందని ఆశిస్తున్నామన్నారు. మంచి నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు కాశీ విశ్వనాథ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.

'ప్రజాపిత బ్రహ్మ ఆశయాన్ని తెలుసుకోవాలి'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత బ్రహ్మకుమారీలు అనుసరించే ఆధ్యాత్మిక జీవన విధానాన్ని, సంస్థ స్థాపనలో పితాశ్రీ బ్రహ్మ బాబా ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని బ్రహ్మకుమారీల ప్రతినిధి బీకే రామేశ్వరి అన్నారు. పితాశ్రీ బ్రహ్మ బాబా 55వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బ్రహ్మకుమారీల సేవా కేంద్రాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే రామేశ్వరి మాట్లాడుతూ 1930లో వజ్రాల వ్యాపారం చేసిన తరువాత ఆయన బ్రహ్మ బాబాగా అవతారమెత్తారని తెలిపారు. బ్రహ్మ రహస్యాన్ని, బ్రహ్మ జ్ఞానాన్ని విస్తృతంగా తెలుసుకోవాలని బాబా ఆకాంక్షించేవారన్నారు. ఏపీ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం శాంతి సందేశమిస్తూ ఆచరిస్తోందని, ఆ దిశగా బ్రహ్మకుమారీలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కీర్తి పట్నాయక్, బీకే శివలాలీ, బీకే సోమేశ్వరి, బీకే ప్రమీలా, బీకే జయలక్ష్మి, బీకే లలిత పాల్గొన్నారు.

ముగ్గురమ్మల స్వరూపం పోలమాంబ

» 20 నుంచి అమ్మవారి జాతర » ఉత్సవ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు



పోలమాంబ అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ముగియడంతో నగర పరిధిలోని అనేక వార్డుల్లో గ్రామ దేవతల పండుగలకు స్థానికులు సన్నద్ధమవుతున్నారు. జగదాంబ నడిబొడ్డున లేపాక్షి ఏరియా కుమ్మర వీధిలో వెలసిన పోలమాంబ అమ్మవారి జాతరకు ఆలయ కమిటీ పనులు చేపట్టింది. వందేళ్ల చరిత్ర గలిగిన పోలమాంబ అమ్మవారు బహుముఖ రూపాల్లో కొలువుతీరడం విశేషం. పోలమాంబను ఎంతో మహిమ గల తల్లిగా భక్తులు కొలుస్తారు. కనకమహాలక్ష్మి అమ్మవారు స్వయంగా పోలమ్మ ఉత్సవాలు నిర్వహిస్తారనేది భక్తుల విశ్వాసం. మహాలక్ష్మి గుడి మాదిరిగానే పోలమ్మ ఆలయం రూపుదిద్దుకోవడం ఇందుకు నిదర్శనం. ఈ నెల 20 నుంచి 22 వరకు పోలమ్మ జాతర జరుగుతుంది. తొలేళ్ల సంబరాలు, పరస మహోత్సవం, అన్నసమారాధన వరుసగా చేపడతారు. ఈ సందర్భంగా వివిధ కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. వాచ్‌హౌస్ వద్ద వేదిక నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహారాణిపేట సీఐ భాస్కర్ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారు.

డెక్కన్ ప్రీమియర్ క్యారమ్స్ లీగ్ ప్రారంభం



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వజ్రా స్పోర్ట్సు ప్రైవేటు లిమిటెడ్ నిర్వహిస్తున్న డెక్కన్ ప్రీమియర్ క్యారమ్స్ లీగ్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీలోని ఎస్3 స్పోర్ట్సు ఎరీనాలో జరుగుతున్న ఈ పోటీలకు డీపీసీఎల్ చైర్మన్ నీరజ్ సంపతి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ టీఎస్ఆర్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంపతి మాట్లాడుతూ డీపీసీఎల్ సీజన్-1 విశాఖలో జరిగిందని, తిరిగి సీజన్-3 పోటీలను ఇక్కడే నిర్వహించడం విశేషమన్నారు. ఈ టోర్నీలో ఎనిమిది జట్లు (జట్టుకు ఎనిమిది మంది ఆటగాళ్లు) రౌండ్ రాబిన్ పద్ధతిలో లీగ్ మ్యాచ్‌లో తలపడతారని, పాయింట్ల ప్రాతిపదికన నాలుగు జట్లు నాకౌట్ దశకు చేరుతాయని పేర్కొన్నారు. ఈ టోర్నీలో అంతర్జాతీయ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, విజేతలకు రూ.12 లక్షల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్యారమ్స్ సంఘం ప్రతినిధులు వి.వి.నారాయణ, భారతి నారాయణ్, ప్రీతి సంపతి, సూర్యదేవర, ఆదిత్య చావలి, విజయ్‌కుమార్, అబ్దుల్ జలీల్, ప్రబల్ మహంతి, బి.కె.రాయ్ తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో ఆలయ సిబ్బంది జోక్యం

» కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తుల అసంతృప్తి



కనక మహాలక్ష్మి అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా కనకమహాలక్ష్మి అమ్మవారిని కొలుస్తున్న భక్తులు మూలవిరాట్‌కు స్వయంగా పూజలు చేసుకునే అవకాశం ఆలయంలో సన్నగిల్లుతోంది. ఆలయ ఆచారానికి విరుద్ధంగా దేవాలయ అధికారులు, సిబ్బంది జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్గశిర మాసోత్సవాల్లో దేవస్థానం సిబ్బంది, సేవకులే భక్తుల చేతిలో పూజాసామాగ్రి, మొక్కుబడి చీర లాక్కున్నారు. అమ్మవారికి స్వయంగా పాలతో అభిషేకం కూడా చేయనివ్వలేదు. మూలవిరాట్ వద్ద వీరి జోక్యంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాసోత్సవాలు ముగిసి సాధారణ పరిస్థితులు వచ్చినా ఇదే పంథాను అనుసరించడాన్ని భక్తుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చారు. దీంతో ఆలయ అధికారులు, సిబ్బంది మూలవిరాట్ వద్ద తాళ్లను అడ్డంగా పెట్టి భక్తుల రాకను అడ్డుకున్నారు. టిక్కెట్ క్యూలైన్లు, సాధారణ దర్శనాల భక్తులను ఆలయ సిబ్బంది నిరోధించి వారి చేతిలో ఉన్న పూజాసామాగ్రిని లాక్కుని దండం పెట్టుకోక ముందే బయటకు గెంటేయడంతో తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. అమ్మవారికి స్వయంగా మొక్కులు చెల్లించుకొని కష్టాలు కడతేర్చాలంటూ వేడుకొనే అవకాశం ఒక్క నిమిషం కూడా ఇవ్వకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయం లోపల గతానికి భిన్నంగా సంప్రదాయాలను అమలు చేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది. హుండీల ఏర్పాటులోనూ అధికారుల వ్యవహార శైలి విమర్శలకు తావుతీస్తుంది. మొక్కులు, ముడుపులు భక్తులు అమ్మవారి హుండీల ద్వారా సమర్పించడం ఆనవాయితీ, అయితే ఇందుకు భిన్నంగా సాగుతోందని భక్తులు, కొందరు ఆలయ ఉద్యోగులు చెబుతున్నారు. కొబ్బరి కాయ కొట్టే అవకాశం కూడా కల్పించకపోవడమేమిటని నిరసిస్తున్నారు. ఆలయ అధికారుల తీరు మారేలా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ఎండాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ ఏసీపీ కార్యాలయం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒమ్మి శ్యామల (47) మద్దిలపాలెంలోని ఆదిత్యనగర్ ప్రాంతంలో ఉన్న రేణు రెసిడెన్సీలో ఫ్లాట్ నెంబర్ 201లో నివాసం ఉంటుంది. ఆనందపురంలో పూలు కొనడానికి అల్లుడితో కలిసి బైక్‌పై వెళుతుండగా ఎండాడ ఏసీపీ కార్యాలయం ప్రాంతానికి వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో శ్యామల రోడ్డుపై పడిపోవడంతో లారీ వెనుక చక్రాలు ఆమె పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీకొక మోడల్ పాఠశాల

... 1వ పేజీ తరువాయి

యూపీ, ఉన్నత పాఠశాలలు 562 ఉన్నాయి. వీటిలో 69,285 మంది చదువుతున్నారు. ప్రభుత్వ, మండల పరిషత్, జీవీఎంసీ పరిధిలో 447 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వాటిలో 42 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంకా మూడు యాజమాన్యాల కింద 29 యూపీ పాఠశాలలుండగా, ఎనిమిదిచోట్ల 60కు మించి విద్యార్థులు ఉన్నారు. ఆ ఎనిమిది పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. మిగిలిన 21 పాఠశాలల్లో 60 మంది కంటేతక్కువ పిల్లలు ఉన్నందున వాటిని ప్రాథమిక పాఠశాలలుగా మార్చి అక్కడ చదువుతున్న 6,7,8 తరగతుల పిల్లలను సమీపంలో ఉన్నత పాఠశాలలకు పంపుతారు. జిల్లాలో 86 ప్రభుత్వ, జడ్పీ, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 40 పాఠశాలల్లో 3,4,5 తరగతులు నిర్వహిస్తున్నారు. వీరంతా గతంలో ఎక్కడ నుంచి వచ్చారో తిరిగి అదే ప్రాథమిక పాఠశాలలకు పంపుతారు. ఈ క్రమంలో ఒక పంచాయతీలో 60 లేదా అంతకుమించి పిల్లలు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఒకదానిని మోడల్ పాఠశాలగా ఎంపిక చేస్తారు. ఇక 60 మంది పిల్లలున్న ప్రాథమిక పాఠశాలలకు ఐదుగురు చొప్పున (ప్రతి పాఠశాలకు ఒక టీచర్) ఉపాధ్యాయులను ఇస్తారు. ఒకవేళ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 146 ఉంటే ఐదుగురు ఎస్టీటీలు, ఒక హెచ్ఎం పోస్టు కేటాయిస్తారు. దీనిపై మండల విద్యాశాఖాధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి సమాచారం సేకరించే పనిలో ఉన్నారు. జీవో 117 రద్దు నేపథ్యంలో ఆరు రకాల పాఠశాలల స్థానంలో ఐదు కేటగిరీల పాఠశాలలు రానున్నాయి. ఈ క్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఈ నెల 20 నుంచి ఉత్తరాంధ్రలో పర్యటిస్తారు.

ఉక్కుకు మంచి రోజులు

... 1వ పేజీ తరువాయి

ప్రకటించిన నేపథ్యంలో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా కర్మాగారం ప్రయాణం మొదలవుతుంది. దీనివల్ల ఉద్యోగులకు భద్రత లభిస్తుంది. యాజమాన్యం ప్రస్తుతం వీఆర్ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానించింది. భవిష్యత్తుపై ఆందోళనతో 370 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు ప్యాకేజీ రావడంతో అత్యధికులు వీఆర్ఎస్‌కు మొగ్గుచూపరనే వాదన వినిపిస్తోంది. అనారోగ్యం, తక్కువ సర్వీస్ ఉన్నవారు తప్ప మిగతావారు కొనసాగుతారని ఉద్యోగ సంఘాలు విశ్వాసం వ్యక్తంచేస్తున్నాయి. ఉత్పత్తికి అవసరమైన ఐరన్‌ఓర్‌ను ఎన్ఎండీసీని అందించి, అదానీ గంగవరం పోర్టు నుంచి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటే అనుకున్న ఉత్పత్తి సాధిస్తామని ఉద్యోగవర్గాలు అన్నాయి.

నేడు స్వచ్ఛ దివస్

... 1వ పేజీ తరువాయి

నిషేధించామని, గ్రామీణ ప్రాంతంలో కూడా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఈ శనివారం ప్రభుత్వ విద్యా సంస్థలకు సెలవు కావడంతో ఈ నెల నాలుగో శనివారం స్వచ్ఛ దివస్ అమలు చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ దివస్ సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలను ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలని తద్వారా ప్రజలు స్ఫూర్తి పొందుతారని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాంకేతికతలో స్వావలంబన సాధించాలి

... 1వ పేజీ తరువాయి

విద్య, అనువర్తిత పరిశోధన, సాంకేతికత, ఉత్పత్తి అభివృద్ధి (అప్లయిడ్ రీసెర్చ్), పరిశ్రమల మధ్య సమన్వయంలో వెనుకబడి ఉన్నామని పేర్కొంటూ దానిని అధిగమించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి ప్రక్రియను నడిపించడంలో సాంకేతిక బదిలీ, పరిశ్రమల సహకారం కీలకమని, దానిని విస్మరించరాదన్నారు. సాంకేతికతలో స్వావలంబన సాధించినప్పుడే దేశం పురోగతి సాధిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రధాని ఆకాంక్షించిన ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా సాంకేతిక రంగంలో స్వావలంబన దిశగా ముందుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఎం గవర్నింగ్ బాడీ సభ్యురాలు మాళవిక ఆర్.హరిత మాట్లాడుతూ 'విద్యా పరమ దైవతం (జ్ఞానం అత్యున్నత దేవత)' అని భర్తృహరి రాసిన నీతి శతకంలో పదబంధాన్ని ప్రస్తావిస్తూ విద్య ప్రాధాన్యం వివరించారు. విద్య, జ్ఞానం, అభివృద్ధి, సామరస్యం, పురోగతిని పెంపొందించడంలో ఐఐఎంవి ముందువరుసలో ఉండాలని ఆకాక్షించారు. ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ గడచిన పదేళ్లుగా అన్ని ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతుందన్నారు. సంస్థలు/పరిశ్రమలను సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా విద్యార్థులలో నాయకత్వ లక్ష్యాలు పెంపొందించేలా వారిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతిభ కనబర్చిన ఎనిమిది మంది విద్యార్థినీ, విద్యార్థులకు డాక్టర్ కామత్ ప్రశంసాపత్రాలతోపాటు గ్రాంట్లు అందజేశారు. సంస్థ డీన్ ఆచార్య కావేరి కృష్ణన్ స్వాగతం పలకగా అకడమిక్ డీన్ ఎం.విజయ భాస్కర్ వందన సమర్పణ చేశారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్టీల్‌సిటీ ఐటీఐలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఎల్ఎల్ఆర్ కలిగి 18 ఏళ్లు నిండిన వారు ఈ నెల 24లోగా ఐటీఐ సెంటర్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 94917 62841లో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అగనంపూడి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ తోట శ్రీవల్లిని స్థానిక నేతలు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అగనంపూడిలో విద్యుత్ సబ్‌స్టేషన్, రైతు బజారు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు గంతకోరు అప్పారావు, బి. సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి ఏర్పాట్లు

గాజువాక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నేటి యువతకు ఆదర్శనీయుడు ఎన్టీ రామారావు అని గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం గాజువాక నియోజకవర్గంలో భారీ ఎత్తున ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, నాయకులు సూర్యనారాయణ, రామ్మోహన్ కుమార్, బైపల్లి గాంధీ, పప్పు శంకరరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల పరస

అగనంపూడి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డులోని దిబ్బపాలెం రామాలయం వద్ద సీతారాముల పరస మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు సీతారాములను దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో పరసను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్లు, సాము గరిడీలు, బొమ్మల కొలువులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు శీరంశెట్టి బాబ్జీ, అప్పారావు, రామారావు, చిన్నారావు, సన్యాసిరావు, గోవిందరావు, బలిరెడ్డి శ్రీను, నరసింగరావు పాల్గొన్నారు

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడీ, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 30, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 46, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 18, క్యారెట్ 46 దొండకాయలు 42, బంగాళ దుంపలు 26,అరటికాయ (పె)7,మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 42, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, గోరు చిక్కుడు 30 దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీరదోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 42,గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 46, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

తిరుగు ప్రయాణంలో తప్పని తిప్పలు

» దువ్వాడ రైల్వే స్టేషన్ కిటకిట
» రిజర్వేషన్ బోగీల్లోనూ కిక్కిరిసిన ప్రయాణికులు



ప్రయాణికులతో రద్దీగా ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్



కిక్కిరిసిన రిజర్వేషన్ బోగీలు

కూర్మన్నపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగ ముగియడం, సోమవారం నుంచి విద్యా సంస్థలు తెరవనున్న నేపథ్యంలో సొంతూళ్లకు పెద్ద పండుగకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. దీంతో శుక్రవారం తిరుగు ప్రయాణికులతో దువ్వాడ రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. రిజర్వేషన్ బోగీలన్నీ జనరల్ బోగీలుగా తయారయ్యాయి. ముందుగా రిజర్వేషన్ చేసుకున్నప్పటికీ ప్రశాంతంగా ప్రయాణించలేని పరిస్థితి నెలకొందని పలువురు ప్రయాణికులు వాపోయారు. రైల్వే అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోలేదని రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇంటర్ సిటీ, నాగావళి, బొకారో, జన్మభూమి, రత్నాచల్, సింహాద్రి, గోదావరి, తిరుమల, రాయఘడ-గుంటూరు, దుర్గ్-విశాఖపట్నం తదితర అన్ని రైళ్లల్లో స్లీపర్ క్లాస్ కోచ్‌లు కూడా జనరల్ కోచ్‌లను తలపించాయి. స్లీపర్ క్లాస్ కోచ్‌ల్లో తీవ్ర రద్దీ నెలకొని పిట్టల్లా వేలాడుతూ ప్రయాణాలు సాగించారు. తిరిగి తమ ఇళ్లకు చేరేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

ఇక సాధారణ కోచుల్లో కనీసం కాలు కదప లేక ఒంటి కాలుపై నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో బోగీల్లోకి వెళ్లలేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. సీఆర్పీ, ఏపీ పోలీసులు దగ్గరుండి ప్రయాణికులను బోగీల్లోకి ఎక్కిస్తున్నారు. ప్రయాణికులు వేలాడుతూ, అవస్థలు పడుతూ స్వస్థలాలకు చేరుకుంటున్నారు. పండగ పూట ఇది సర్వసాధారణంగా మారిపోయిందని కొందరు ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉక్కుకు ప్యాకేజీ ప్రకటనతో నేతల సంబరాలు



కేంద్ర ప్రభుత్వ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తున్న కూటమి నేతలు

గాజువాక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్వ వైభవానికి కేంద్రం అద్భుతమైన ప్యాకేజీ ప్రకటించిందని గాజువాక కూటమి నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు భారీ ప్యాకేజీ ప్రకటించటంతో పాత గాజువాక జంక్షన్‌లో కూటమి నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లటంలో సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన కృషి విశేషమైందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా గాజువాకలో ఆమరణ నిరాహార దీక్షకు దిగిన వ్యక్తి పల్లా శ్రీనివాసరావు ఇక్కడ పరిస్థితులను రాష్ట్రం, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ప్యాకేజీ వచ్చినట్టు చేశారన్నారు. అతి త్వరలోనే ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, కరణంరెడ్డి నరసింగరావు, కనతాతారావు, పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరవాఉ, మొల్లి ముత్యాలనాయుడు, దల్లి గోవింద్, రామ్మోహన్‌కుమార్, గడసాల అప్పారావు పాల్గొన్నారు.

కార్మికుల జోలికొస్తే సహించేది లేదు

స్టీల్‌ప్లాంటు యాజమాన్యానికి ఇంటక్ అధ్యక్షుడు రమణమూర్తి హెచ్చరిక



మాట్లాడుతున్న ఇంటక్ అధ్యక్షుడు రమణమూర్తి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను ఇబ్బందులకు గురిచేసేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని, ఇది మంచి పద్ధతి కాదని, కార్మికుల జోలికొస్తే కార్మిక సత్తా చూపుతామని ఇంటక్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి అన్నారు. ఎల్ఎంఎంఎం పార్కులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు గత కొన్ని నెలలుగా జీతాలు సరిగా ఇవ్వడం లేదని, దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపే వరకూ ఉద్యమాలు చేస్తామని, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బీఎన్ రాజు, నాయకులు కారు రమణ, మోహన్, కొవిరి అవతారం, రాథోడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

87వ వార్డులో విండ్‌బాల్ పోటీలు ప్రారంభం



విండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జగన్

కూర్మన్నపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని జీవీఎంసీ 87వ వార్డు అప్పికొండలో శుక్రవారం విండ్‌బాల్ టోర్నమెంట్‌ను కార్పొరేటర్ బొండా జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి నందమూరి తారక రామారావు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. క్రీడల్లో యువత రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఈ పోటీల్లో విజేతలకు 18న బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ విజయరామరాజు, మూటూరి రాము, బి.రాజన్ రాజు, ప్రగడ దానయ్య, వర్రె రాంబాబు, సూరిశెట్టి పెంటారావు,సిరసపల్లి శ్రీను, కాండ్రేకుల శ్రీను, పోతల కృష్ణ, గెద్దాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు గేటు వద్ద విస్తృత తనిఖీలు



ప్రధాన గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉక్కు సీఐఎస్ఎఫ్ అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ ప్రధాన గేటు, విస్తరణ గేటు, అప్పికొండ గేటు, బీసీ గేటు వద్ద అదనపు సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించారు. ప్లాంట్‌లోకి వెళ్లే ప్రతి వ్యక్తి, వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత మాత్రమే ప్లాంట్‌లోకి అనుమతించారు. అలాగే ప్లాంట్‌లో ప్రతి విభాగం వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సీఐఎస్ఎఫ్ అధికారులు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు ఉద్యోగులకు సూచించారు.

ఇంటర్వ్యూ..

మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం

- జె.భారతి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, అగనంపూడి



ప్రశ్న : రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయా?

జవాబు : ఈ ఆస్పత్రికి వచ్చే రోగులు, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యులు, సిబ్బంది పని చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. గర్భిణులను ఎప్పటికప్పుడు పరీక్షించడంతో పాటు ప్రసవాల చేస్తున్నాం. అలాగే రోగులకు అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నాం.

ప్ర: ప్రస్తుతం ఆస్పత్రి ఓపీ ఎలా ఉంది?

జ: ఓపీ సంఖ్య ఎక్కువగా ఉంటోంది. సుమారు 400 నుంచి 500 వరకు రోగులు వస్తుంటారు. వారిలో 70 మంది వరకు ఇన్‌పేషెంట్స్ ఉంటున్నారు. వారికి సరిపడా మంచాలు లేకపోవడంతో కొంత మేర ఇబ్బందులు ఉన్నాయి. ఒక బ్లాకు మొత్తం డయాలసిస్ కేంద్రానికి అప్పగించడంతో ఈ సమస్య ఉంది. వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ భవన నిర్మాణాలు అందుబాటులోకి రాకపోవడంతో కొంత మేర వసతి సమస్య ఏర్పడింది.

ప్ర: చలి కాలంలో బాలింతలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జ: చలి గాలులకు బాలింతలు, శిశువులను దూరంగా ఉంచాలి. వెచ్చగా ఉండే విధంగా రగ్గులను కప్పుకోవాలి, చర్మం పొడి బారకుండా ఎప్పటికప్పుడు కొబ్బరి నూనె రాస్తే మంచిది.

ప్ర: ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల లక్ష్యం ఎంత?

జ: ఆస్పత్రిలో లక్ష్యానికి మించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా 60 వరకు శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం నెలకు 80 వరకు జరుగుతున్నాయి.

- అగనంపూడి (ఆంధ్రజ్యోతి)

ఉక్కు పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయం

ప్రభుత్వ విప్ గణబాబు



మల్కాపురంలో జరిగిన వేడకల్లో నృత్యం చేస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు

మల్కాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని, అందులో భాగంగానే కర్మాగారం పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శుక్రవారం 40, 58 నుంచి 63 వార్డులకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద గణబాబు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో ఉంచి ప్లాంట్ భూములను అమ్మడానికి సిద్ధమైందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చొరవతో కేంద్రం కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించడం ఆనందకరమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గోపాలపట్నం : కేంద్రం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,500 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించడంతో ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యంలో గోపాలపట్నంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ వెంటిలేటర్‌పై ఉన్న ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీతో జీవం పోసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గత ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ భూముల్ని అమ్ముకోవాలని చూసిందని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్‌కు రూ.1650 కోట్లు చంద్రబాబు కృషితో మంజూరైందని గుర్తు చేశారు. తాజాగా భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం వల్ల కర్మాగారానికి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బాణసంచా కాల్చి, నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంచారు.

విశాఖ ఉక్కుకు మళ్లీ ఊపిరి

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కుకు కూటమి ప్రభుత్వం అభ్యర్థన మేరకు కేంద్రం మళ్లీ ఊపిరి పోసినట్లయిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, 86 వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి నల్లూరు సూర్యనారాయణ, రాష్ట్ర టీడీపీ పరిశీలకుడు పప్పు రాజారావు అన్నారు. శుక్రవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అన్న సెంటిమెంట్‌ను గౌరవిస్తూ కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించిందని చెప్పారు. కాగా 86 వార్డు కూర్మన్నపాలెం ఎన్టీ ఆర్ విగ్రహం వద్ద శనివారం ఉదయం ఎన్టీ ఆర్ వర్ధంతి నిర్వహించనున్నట్టు వార్డు ఇన్‌ఛార్జి నల్లూరు సూర్యనారాయణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విశాఖపట్నం : స్టీల్‌ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం రూ. 11,500 కోట్లు భారీ ప్యాకేజీ ప్రకటించడం పట్ల మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్లాంటును ఆదుకునేందుకు తనతో పాటు కూటమి నేతలు కూడా కేంద్రానికి అనేక విజ్ఞప్తులు చేశారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర నాయకులుగా తాము ఉక్కు ప్రయోజనాలకు ఎప్పటికప్పుడు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

నా రాజీనామాకు సార్థకత

» స్టీల్‌ప్లాంట్‌కు సాయంపై భీమిలి ఎమ్మెల్యే వ్యాఖ్య



విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవానికి కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించడంతో తన రాజీనామాకు సార్థకత లభించినట్లయిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఎంవీపీ కాలనీలోని తన స్వగృహంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా చూస్తామన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నపుడు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణపై కేంద్రం ప్రకటనను నిరసిస్తూ తాను 2021 ఫిబ్రవరి 12న స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా చేసిన విషయాన్ని, పాతికేళ్ల క్రితం సీఎం చంద్రబాబు నాయుడు ఇదే ప్రతిపాదనపై అప్పటి ప్రధాని వాజ్‌పేయి హయాంలో అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీతో సంప్రదింపులు జరిపి భారీ ప్యాకేజీ వచ్చేలా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజయనగరం జిల్లా గర్భాంలో మాంగనీసు గనుల లీజును మరో పదేళ్లు పునరుద్ధరించిన సంగతిని గుర్తుచేశారు. అంతకుముందు ఆయన ఇంటి ముందు బాణసంచా కాల్చి హర్షం ప్రకటించారు. కార్పొరేటర్లు పీవీ నరసింహం, లొడగల అప్పారావు, భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు రామానాయుడు, శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మళ్ల' తీరు నచ్చకే వైసీపీకి దూరం

వైఎస్ఆర్ టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు బద్రీనాథ్

మల్కాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ తీరు నచ్చకే పార్టీకి దూరం అవుతున్నానని జిల్లా వైఎస్ఆర్‌టీయూసీ మాజీ అధ్యక్షుడు కలిదండి బద్రీనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన శ్రీహరిపురంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్ల కంటే ముందు నుంచీ తాను రాజకీయాల్లో ఉన్నానని, ప్రజాప్రతినిధిగా ఎంతో గుర్తింపు ఉన్న తనను మళ్ల అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి ద్రోహం చేసిన వారికి చేయూతనిస్తూ పార్టీని మరింత నష్టపరుస్తున్నారని విమర్శించారు. త్వరలోనే తాను ఏడు వార్డుల ముఖ్యమైన నాయకులతో కలిసి బీజేపీలో చేరనున్నట్టు చెప్పారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

మల్కాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ప్రజలు అందుకు సహకరించాలని 58వ వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ అన్నారు. శ్రీహరిపురం ప్రాంతంలో జీవీఎంసీ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మైక్రో కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నిషేధించామని, వాటికి బదులు గుడ్డ, నార సంచులు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహరించా లని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయించిన, వినియోగించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని వినతి

మల్కాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : డాక్‌యార్డు సమీపంలో ఉన్న సర్ధార్ వల్లాబాయ్ పటేల్ వంతెన మూతపడిన తరువాత పారిశ్రామిక ప్రాంతవాసులకు ప్రయాణ కష్టాలు ఎక్కువయ్యాయని, ఈమేరకు ములగాడ రహదారి కీలకంగా మారిందని స్ఫూర్తి టీమ్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం వారు పోర్టు అధికారులను కలిసి ములగాడ రహదారి మరమ్మతుల గురించి విన్నవించారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రయాణాలు సాఫీగా సాగేలా చూడాలని కోరారు. స్పందించిన పోర్టు అధికారులు త్వరలోనే రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

పెందుర్తి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి సభ

పెందుర్తి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతి సభ పెందుర్తిలో శనివారం నిర్వహించనున్నట్టు జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కూడలిలో జరిగే ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ హాజరవుతారని చెప్పారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కాకానీ నగర్‌లో శ్రీకృష్ణ దేవరాయలు జయంతి

ఎన్ఏడీ జంక్షన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90 వార్డు కాకానీనగర్‌లోని కేటీబీ కళాక్షేత్రంలో ఈఎన్‌సీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలువురు కృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

సత్తెమ్మ తల్లికి పూజలు

వేపగుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు శ్రీనివాసానగర్‌లో కొలువైన సత్తెమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. మధ్యాహ్నం 300 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా పరదేశిమాంబ పరస

పెందుర్తి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సరిపల్లి ప్రజల ఆరాధ్య దేవత పరదేశిమాంబ పరస శుక్రవారం ఘనంగా జరిగింది. ఉత్సవం సందర్భంగా గ్రామం నుంచి ఆలయం వరకు విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



తిరువీధిలో పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

యోగ నారసింహుడిగా అప్పన్న దర్శనం

సింహాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులకు యోగానారసింహుడిగా శుక్రవారం దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని యోగాసన ముద్రలో ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి, పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితులు వేద మంత్రోచ్చారణలు, కళాకారుల కోలాటం, భక్తుల హరినామస్మరణ నడుమ మాడవీధుల్లో తిరువీధి వైభవంగా జరిపారు. మార్గమధ్యంలో భక్తులు ఫలాలు సమర్పించి, కర్పూర నీరాజనాలు ఒసగి ఆహ్వానం పలికారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

విశాలాక్షినగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు శుక్రవారం కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో 333 అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు ఎస్. బాలసూర్యారావు, ఎల్. మన్మథరావు, బి. రామకృష్ణారావు, టి. కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

90 గంటలు పని చేయాలా!?

ఎల్ అండ్ టి చైర్మన్ వ్యాఖ్యలు మరింత శ్రమదోపిడీకి గురిచేసేలా ఉన్నాయంటూ ఉద్యోగుల ధ్వజం



"ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలి. ఇంట్లో కూర్చుని భార్యను ఎంతసేపు చూస్తారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని జీవిత భాగస్వామికి చెప్పండి. ఆదివారం మీతో పని చేయించలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. అలా చేయించ గలిగితే నాకు సంతోషం. ఆదివారం నేను కూడా పనిచేస్తాను"... -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం



- ఇంట్లో కూర్చుని భార్యను ఎంతసేపు అలా చూస్తూ ఉంటారనడంపై తీవ్ర దుమారం
- మహిళలను అవమానించడమేనంటూ ఆగ్రహం
- పని ప్రదేశంలో వాతావరణం దెబ్బతినడంతోపాటు పనితీరుపైనా ప్రభావం చూపుతుందంటున్న మానసిక వైద్యులు

అంటూ ఉద్యోగులను ఉద్దేశించి ఇటీవల ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేకెత్తిస్తున్నాయి. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల వేదికగా నెటిజన్లు దుమ్మెత్తిపో స్తున్నారు. వివిధ రంగాలకు చెందిన సెలబ్రిటీలు కూడా గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. ఈ వ్యాఖ్యలు మహిళలను అవమానించడమే కాకుండా మరింత శ్రమ దోపిడీకి గురిచేసేలా ఉన్నాయంటూ పేర్కొంటున్నారు.

ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణ్యనే కాదు... గతంలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి కూడా దేశం అభివృద్ధి పథంలో సాగాలంటే యువత కనీసం 70 గంటలు పనిచేయాలని చెప్పుకొచ్చారు. ఆయన వ్యాఖ్యలపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. తాజాగా ఎల్ అండ్ టీ చైర్మన్ మరో అడుగు ముందుకువేసి ఏకంగా వారానికి 90 గంటలు పనిచేయాలన్నారు. ఈ వ్యాఖ్యల పట్ల వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు అసహనాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఇంటికి కూడా దూరంగా ఉండాలని చెప్పడం ద్వారా ఉద్యోగులను కనీసం మనుషులుగా కూడా గుర్తించలేని స్థితికి ఇటువంటి పెద్ద మనుషులు చేరుకుంటున్నారంటూ ఐటీ ఉద్యోగి జాహ్నవి పేర్కొన్నారు. ఇప్పటికే గంటల తరబడి పనిచేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని, వృత్తిపరమైన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఇంటికి మించిన రిలాక్సేషన్ సెంటర్ మరొకటి ఉండదని ఒక ప్రముఖ మాల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న రమేష్ పేర్కొన్నారు.

పని భారంతో ఇబ్బందులు

రోజులో కొంత సమయం పనికి, మరికొంత సమయం వ్యక్తిగత వ్యవహారాలకు, మరికొంత సమయం నిద్రకు కేటాయించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎనిమిది గంటల పని విధానమే అమలులో ఉన్నప్పటికీ అనేక సంస్థలు పది గంటలకుపైగానే పని చేయించుకుంటున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అయితే కనీసం 10 నుంచి 12 గంటలు పనిచేస్తు న్నారు. ఇటువంటి పరిస్థితుల్లో 90 గంటలు అంటే ప్రతిరోజూ 13 గంటలు పనిచేయాల్సి ఉంటుందని, దీనివల్ల ఉద్యోగి పూర్తిగా యంత్రం మాదిరిగా మారిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్న భావనను పలువురు వ్యక్తంచేస్తున్నారు. ఇది పని సామర్థ్యాన్ని, పనిచేసే ప్రదేశంలోని వాతావరణాన్ని కూడా నాశనం చేస్తుందని మానసిక నిపుణులు చెబు తున్నారు.

మహిళలను అవమానించే రీతిలో వ్యాఖ్యలు



ఇంట్లో ఉండే మహిళలను చూడ లేమన్న రీతిలో ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. కుటుంబ విలువల గురిం చి తెలిసిన వాళ్లు ఎవరూ అలా మాట్లాడరు. పని ప్రాంతాల్లో తీవ్రమైన ఒత్తిడి, ఆలసటతో ఇబ్బంది పడేవాళ్లకు ఇల్లు ఒక రిలాక్సేషన్ సెంటర్ మాదిరిగా ఉపయోగపడుతుంది. కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడం వల్ల ఉత్తేజితమై మరింత ఉత్సా హంగా పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. మహి ళలు కూడా అనేక రంగాల్లో పనిచేస్తున్నారు. మహి ళలు అందరూ ఇళ్లల్లోనే ఉంటున్నట్టు మాట్లాడడం భావ్యం కాదు. మహిళా రంగాన్ని చిన్నచూపు చూసే లా వ్యాఖ్యలు ఉన్నాయి. భార్యాభర్తలు వారాంతంలో కూడా కలిసి ఉండకపోతే వైవాహిక జీవితం ఎటువైపు వెళుతుందో ఆయనకు తెలియదా. ఆయన ఇంట్లో ఉన్న వాళ్లంతా అలానే పనిచేస్తున్నారా చెప్పాలి. ఒక రకంగా చెప్పాలంటే ఇది శ్రమ దోపిడీ చేసేందుకు వేస్తున్న ప్రణాళికే. - సీహెచ్ సంధ్య, గృహిణి

పనితీరుపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం



పరిధికి మించి పనిచేయడం వల్ల ఇబ్బందులు ఎదురవు తాయి. తీవ్రమైన ఒత్తిడికి గురై ఇతర ఇబ్బందులు వేధిస్తాయి. ఇది రోజువారీ పనితీరును మరింత దిగజార్చే అవకాశం ఉంది. ఉద్యోగులు ప్రశాంతంగా పనిచేస్తున్నా రంటే దానికి జీవిత భాగస్వామి, కుటుంబ సభ్యులు సహకారమే కీలకం అన్న విషయాన్ని గుర్తించాలి. పని ఒత్తిడి తట్టుకోలేక ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ మధ్యకా లంలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో ఆత్మ హత్య చేసుకున్నారు. గంటల తరబడి పనిచే యడం వల్ల ఒత్తిడి, చికాకు, డిప్రెషన్ వంటి సమస్యలు వేధిస్తాయి. కొన్ని పనులు శారీరక, మానసిక సమస్యలు వచ్చేందుకు కారణమ వుతాయి. వారానికి 90 గంటలు పనిచేయడం వల్ల అనేక ఇబ్బందులు ఉంటాయి. - పూజిత జోస్యుల, మానసిక నిపుణులు

గంటల తరబడి కూర్చున్నా ఫలితం ఉండదు



- పల్లేడ జగదీశ్వరరావు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఏ రంగంలో అయినా ఎనిమిది గంటలకు మించి పని చేయకూడదు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఈ పరిధి ఎప్పుడో దాటిపోయింది. అధికారికంగా ఎనిమిది గంటలే పని చేయాలి. కానీ, మేము పది గంటలకుపైగా పనిచేస్తున్నాం. దీనికి తోడు ఇంటికి వెళ్లిన తరువాత కూడా అత్యవసర పరిస్థితుల్లో కంప్యూటర్ల ముందు గంటల తరబడి కూర్చోవాల్సి వస్తోంది. ఈ తరహా ఒత్తిడి నుంచి రిలాక్స్ అయి మెరుగ్గా పని చేసేందుకు కుటుంబ వాతావరణమే దోహదం చేస్తుంది. అటువంటి కుటుంబానికి దూరంగా ఉంటే మెంటల్ టెన్షన్ పెరుగుతుంది. ఇది రోజువారీ పనితీరుపైనా ప్రభావం చూపిస్తుంది. ప్రశాంత మనసుతో పనిచేయడం వల్ల మంచి ఉత్పత్తి సాధ్యమవుతుంది. పనిపై దృష్టి సారించలేని స్థితిలో ఆఫీసులకు వచ్చి గంటల తరబడి కూర్చుని పనిచేసినా ప్రయోజనం ఉండదు. పది గంటలు కూర్చుని పనిచేస్తున్నందుకే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మెడనొప్పి, కంటి సమస్యలు, తలనొప్పి వంటి ఇబ్బందులు అనేకం వేధిస్తున్నాయి.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు



కప్ప స్తంభం వద్ద జె.సుమతి దంపతులు



బీఎస్ భానుమతి

సింహాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు కిరణ్మయి, జె.సుమతి, బీఎస్ భానుమతి, తెలంగాణలోని అదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావులు దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, ఇతర అధికారులు పూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలివ్వగా, అధికారులు శాలువాతో సత్కరించి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



కప్ప స్తంభం వద్ద హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి దంపతులు

త్రిపుర గవర్నర్‌కు ఘన స్వాగతం



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నగర పర్యటనకు వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం మధ్యాహ్నం ఆయన విమానాశ్రయానికి చేరుకోగా బీజేపీ నాయకులు కాశీరాజు, బాలరాజేశ్వరరావు, నాగేంద్ర తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరంలోకి బయలుదేరి వెళ్లారు.

ఐఎన్ఎస్ కళింగ విస్తరణకు సన్నాహాలు

- 160 ఎకరాలు అవసరమని నేవల్ ఉన్నతాధికారుల ప్రతిపాదన
- భూ వివరాల సేకరణలో రెవెన్యూ అధికారులు

భీమునిపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్‌లో వున్న ఐఎన్ఎస్ నేవల్ స్టేషన్ విస్తరణకు సన్నాహాలు జరుగుతున్నాయి. కళింగను ఆనుకుని వున్న నేరేళ్లవలస, ఆర్‌వై అగ్రహారం, కొత్తవలస గ్రామాల్లోని 160.74 ఎకరాలను స్వాధీనం చేసుకోనున్నారని తెలిసింది. ఈమేరకు నేవల్ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు తమ ప్రతిపాదనను, విస్తరణ ఆవశ్యకతను వివరించారని సమాచారం. భీమిలి తహసీల్దార్, సర్వే సిబ్బంది, కలెక్టరేట్ సర్వే సిబ్బంది సంయుక్తంగా సర్వే చేస్తున్నారు. ఐఎన్ఎస్ కళింగకు 1970లో ప్రభుత్వ భూమి 655 ఎకరాలు అప్పగించారు. ప్రస్తుతం మరో 160 ఎకరాలు అప్పగించడానికి కార్యాచరణ జరుగుతుంది. ఇందులో ప్రభుత్వ భూమి 124.10 ఎకరాలు, కాగా ప్రైవేటు భూమి 36.74 ఎకరాలు. ప్రభుత్వ భూమి నేరేళ్లవలసలో 0.07 ఎకరాలు, కొత్తవలసలో 79.26 ఎకరాలు, ఆర్‌వై అగ్రహారంలో 44.67 ఎకరాలు ఉంది. ప్రైవేట్ భూమి నేరేళ్లవలసలో 21.25 ఎకరాలు, కొత్తవలసలో 4.61 ఎకరాలు, ఆర్‌వై అగ్రహారంలో 10.88 ఎకరాలు సేకరించాలని ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా నేరెళ్లవలసలో 21.32 ఎకరాలు, కొత్తవలసలో 83.87 ఎకరాలు, ఆర్‌వై అగ్రహారంలో 55.55 ఎకరాలు ఐఎన్ఎస్ కళింగ విస్తరణకు అవసరమని నేవల్ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు వివరించారని తెలిసింది. విస్తరణలో భాగంగా బఫర్ జోన్ ఏర్పాటుకు కూడా ఈ స్థలం అవసరమని తెలిపారు. ఈ విషయమై భీమిలి తహసీల్దార్ పి. రామారావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ జిల్లా అధికారులకు ప్రతిపాదనలు అందాయని, ప్రస్తుతం సర్వే జరుగుతుందన్నారు. పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు.

పతాక నిధికి విరాళాల సేకరణలో జిల్లా ప్రథమం

- గవర్నర్ నుంచి ట్రోఫీ, ప్రశంసాపత్రం

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం-2023 సందర్భంగా పతాక నిధికి చేపట్టిన విరాళాల సేకరణలో విశాఖపట్నం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపు మేరకు పలు సంస్థలు, అధికారులు, సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.24.48 లక్షల విరాళం అందజేశారు. రాష్ట్రంలోనే విరాళాల సేకరణలో విశాఖ ప్రథమ స్థానంలో ఉండడంతో ఈ నెల 12న విజయవాడ వేదికగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లాకు ట్రోఫీ, ధ్రువీకరణ పత్రం బహూకరించారు. గవర్నర్ నుంచి స్వీకరించిన ట్రోఫీ, ధ్రువీకరణ పత్రాన్ని జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం శుక్రవారం కలెక్టర్‌కు అందజేశారు. సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు ఇచ్చి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన అధికారులు, సంస్థలు, సామాజిక కార్యకర్తలకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి, సిబ్బందిని అభినందించారు.



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి సత్యానందం

విశాఖలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

మహారాణిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పండుగలకు, వేడుకలకు వస్త్రధారణలో గొప్ప అనుభూతిని కలిగించే నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్ విశాఖలోని హోటల్ గ్రీన్ పార్కులో నిర్వహిస్తున్నారు. ఈ నెల 20 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు కలబోసిన వివిధ రాష్ట్రాల ఉత్పత్తులన్నీ ఈ ఎక్స్‌పోలో లభిస్తాయి. మహారాష్ట్ర పైఠాని సిల్క్ చీరలు, కర్ణాటకలోని బెంగళూరు సిల్క్ కషిదా సిల్క్ చీరలు, చందేరీ మహేశ్వరీ సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన పలు రకాల సిల్క్ చీరలు, దుప్పట్లు, సల్వార్ మెటీరియల్, వివిధ డిజైనర్ వస్త్రాలు ఒకేచోట లభిస్తాయి. బీహార్‌కు చెందిన టస్సార్ మట్కా భాగల్పూర్ సిల్క్ చీరలు, కాంజీవరం, జమ్ముకాశ్మీర్ సిల్క్ చీరలు లభిస్తాయన్నారు. ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమని తెలిపారు.



ఎగ్జిబిషన్‌లో వస్త్ర ప్రదర్శన

నేడు, రేపు జ్యుడీషియల్ కాన్ఫరెన్స్

డాబాగార్డెన్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ 2 రీజినల్ జ్యుడీషియల్ కాన్ఫరెన్స్ ఈ నెల 18, 19 తేదీల్లో ఏయూ కన్వెన్షన్ హాల్ వేదికగా జరగనుంది. శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ అనిరుద్ధ బోస్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఇతర న్యాయకోవిదులు హాజరవుతారు.

హౌస్ హోల్డ్ సర్వే ప్రక్రియను 30లోగా పూర్తి చేయండి

- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశం



డాబాగార్డెన్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక లక్ష్యాల సాధనకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన హౌస్ హోల్డ్ సర్వే ప్రక్రియను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని, సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. జోన్ 3 పరిధి న్యూ వెంకోజీపాలెం ఒకటో సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరు, ప్రగతి సాధన, హాజరు శాతం తదితర అంశాలపై ఆరా తీస్తూ రికార్డులు తనిఖీ చేశారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్దేశిత లక్ష్యాల సాధనకు నిత్యం శ్రమించాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఎంఎస్ఎంఈ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఈకేవైసీ, అదృశ్యమైన పౌరుల వివరాల సేకరణను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా సచివాలయాల సమన్వయకర్త ఉషారాణి, జోనల్ కమిషనర్, ఇతర అధికారులు ఉన్నారు.

క్రైం... crime news

దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

గాజువాక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ములగాడ ప్రాంతంలో దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని శుక్రవారం గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 15న ములగాడ వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యల్లపు సారథిపై దాడి చేసి సెల్‌ఫోన్, నగదు అపహరించిన శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన కె.మనోజ్‌కుమార్ (19), కె.బాలకృష్ణ (22)లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిద్దరూ చెడు వ్యసనాలకు బానిసై ఇలాంటి దోపిడీలకు పాల్పడుతున్నారని పోలీసులు పేర్కొన్నారు.

గేమ్ ఛేంజర్ సినిమా పైరసీ ప్రదర్శించిన వ్యక్తిపై కేసు

గాజువాక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన గేమ్ ఛేంజర్ సినిమా పైరసీ చేసిన వ్యక్తిపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి గాజువాక సీఐ పార్థసారధి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక ప్రాంతంలో ఏపీ లోకల్ టీవీ ఛానల్‌లో గేమ్ ఛేంజర్ సినిమా ప్రదర్శించాడు. దీనిపై సమాచారం అందుకున్న చిత్ర ప్రతినిధులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గాజువాక పోలీసులు దాడులు నిర్వహించి ఛానల్ అధినేత జెవీకె అప్పలరాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

కుమార్తెను కొట్టానన్న బాధతో ఉరేసుకుని వ్యక్తి మృతి

సీతంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుమార్తెను కొట్టానన్న ఆత్మన్యూనతాభావంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు నాలుగో పట్టణ పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం చిన్నూరు ప్రాంతానికి చెందిన ఎస్కే సలీమ్ (32) తన భార్య ఫర్వీన్, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. సలీమ్ నెహ్రూ బజార్‌లో మాంసం దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 15న తన కుమార్తెను చదువుకోవాలని మందలిస్తూ వైరుతో కొట్టి, అనంతరం బాధపడ్డాడు. చాలాసార్లు బాధను వ్యక్తంచేసి చనిపోతానంటే భార్య ఓదార్చేది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంటి హాలులో సలీమ్ మొబైల్ చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో భార్య, పిల్లలు పడక గదిలోకి వెళ్లారు. ఎంత సేపటికీ భర్త సలీమ్ లోపలకు రాకపోవడంతో ఫర్వీన్ బయటకు వచ్చింది. అప్పటికే అతడు చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండటాన్ని చూసింది. వెంటనే స్థానికుల సహాయంతో చున్నీని కోసి కిందికి దించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సలీమ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఫర్వీన్ ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో హెచ్‌సీ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు.

లా వర్సిటీలో హైకోర్టు సీజే



విద్యార్థినుల వసతిగృహం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

- కులపతి హోదాలో జనరల్ కౌన్సెల్ సమావేశం నిర్వహించిన జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- విద్యార్థినుల వసతిగృహాలు ప్రారంభం
- హాస్టళ్ల నిర్వహణ, మెనూ అమలుపై పలు సూచనలు

సబ్బవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం ఇక్కడ దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం సుమారు నాలుగు గంటలపాటు విశ్వవిద్యాలయంలో గడిపారు. కులపతి హోదాలో జనరల్ కౌన్సెల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగల పనితీరును సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల కోసం కొత్తగా నిర్మించిన రెండు వసతిగృహాలను ఆయన ప్రారంభించారు. అన్ని హాస్టళ్లను పరిశీలించి, విద్యార్థుల భోజన, వసతి సదుపాయాల గురించి సమీక్ష చేశారు. వసతుల మెరుగునకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. విద్యార్థుల మెస్ కమిటీ పనితీరును సమీక్షించారు. వసతిగృహాల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంను సీజే పరిశీలించారు. ఆయన వెంట హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మాడాసు, చీఫ్ వార్డెన్ భాగ్యలక్ష్మి వున్నారు.

అందెశ్రీ, ఖాదర్ మెహియుద్దీన్‌లకు నేడు లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాలు

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, సినీ హాస్యనటుడు బ్రహ్మానందం రాక

సిరిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): లోక్ నాయక్ ఫౌండేషన్ సారథ్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి, ఏఎన్నార్ శత జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఈ నెల 18న సాయంత్రం 5 గంటలకు ఆంధ్ర యూనివర్సిటీ డా.బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో నిర్వహించనున్నట్టు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఏయూ హిందీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది ఇద్దరు సాహితీవేత్తలు కవి అందెశ్రీ, ఖాదర్ మెహియుద్దీన్‌లకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వీరికి రూ.2 లక్షల వంతున నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. స్వర్ణభారతి ట్రస్ట్ ఇమ్మణ్ణి దీపా వెంకట్, స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమ నిర్వాహకులు డా.డి.ఆర్.కె.ప్రసాద్, డా.పద్మావతి దంపతులు, వైద్య ప్రముఖులు డా.పోలిచర్ల హరినాథ్ (అమెరికా)లకు జీవన సాఫల్య పురస్కారాలు అందజేస్తామన్నారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, గౌరవ అతిథిగా ప్రముఖ సినీ హాస్యనటుడు డా.కన్నెగంటి బ్రహ్మానందం, ఆత్మీయ అతిథులుగా చలసాని అశ్వనీదత్, వై.వి.ఎస్.చౌదరి, వల్లేపల్లి శశికాంత్, లావు రాణి రుద్రమదేవిలు హాజరవుతారనానరు. సమావేశంలో యార్లగడ్డ శివరామ్, లోక్‌నాయక్ ఫౌండేషన్ కార్యదర్శి ఆచార్య నల్ల బాబాయ్ పాల్గొన్నారు.

అప్పన్న ఆభరణాల రికార్డులు పరిశీలన

సింహాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధీనంలోని స్వర్ణ, రజిత ఆభరణాల రికార్డులను దేవదాయ శాఖ జ్యూవెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు శుక్రవారం పరిశీలించారు. కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన కె. ప్రభాకరాచారి దేవదాయ శాఖ కమిషనర్‌కు స్వామివారికి భక్తులు సమర్పించిన ఆభరణాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, వాటిని పరిశీలించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కమిషనర్ కాకినాడ ప్రాంతానికి చెందిన ఆర్‌జేసీని విచారణకు ఆదేశించారు. ఆయన ఆలయానికి వచ్చి జేఈఓ పల్లంరాజుతో కలిసి పరిశీలన ప్రారంభించారు. ఏఈఓ, ఇతర సిబ్బందితో కలిసి రాజగోపురంలోని ప్రత్యేక గదిలో రికార్డుల పరిశీలన చేపట్టారు. ఈ విషయం తెలిసిన ఫిర్యాదుదారు ప్రభాకరాచారి, వీహెచ్‌పీ నేతలతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. పల్లంరాజును కలవాలని యత్నించగా అందుకు ఆయన నిరాకరించారు. ఈ సందర్భంగా ప్రభాకరాచారి విలేకరులతో మాట్లాడుతూ అప్పన్న ఆభరణాల విషయంలో తేడాలున్నాయనడానికి అధికారుల తీరే నిదర్శనమని ఆరోపించారు. ఎటువంటి బెదిరింపులకు భయపడనని, తన వద్ద ఉన్న ఆధారాలతో హైకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు. ఈఓ వేంద్ర త్రినాథరావును వివరణ కోరగా విచారణ అధికారి కోరిన రికార్డులు అందజేయడమే తన విధి అని తెలిపారు. నేరం రుజువైతే దోషులపై చట్టపరంగా చర్యలుంటాయని చెప్పారు.